# టారిఫ్‌లు తగ్గించిన రష్యా

**న్యూఢిల్లీ:** రష్యాపై మరింత ఒత్తిడి పెంచేలా అమెరికా సెనేటర్లు సవరించిన సరికొత్త ఆంక్షల బిల్లును ప్రవేశపెట్టారు. అయితే.. రష్యా నుంచి ముడి చమురు, గ్యాస్‌ను భారీగా దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనాతో పాటు ఇతర దేశాలకు విధించాలనుకున్న భారీ టారిఫ్‌లను (సుంకాలను) ఈ కొత్త బిల్లులో గణనీయంగా తగ్గించడం గమనార్హం. దివంగత అమెరికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం రూపకల్పన చేసిన ఈ ద్వైపాక్షిక బిల్లు.. రష్యా ఆదాయ వనరులపై దెబ్బకొట్టడంతో పాటు రష్యా ఇంధనంపై ఆధారపడే దేశాలు ఆ దిగుమతులను తగ్గించుకునేలా ప్రోత్సహించే లక్ష్యంతో తీసుకువచ్చారు.

**టారిఫ్‌లు 500% నుండి 100% కి తగ్గింపు**

ఈ సవరించిన ప్రతిపాదన ప్రకారం.. రష్యా నుంచి అత్యధికంగా చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాలపై విధించే గరిష్ట సుంకాన్ని 100 శాతానికి తగ్గించారు. మునుపటి బిల్లులో దీనిని ఏకంగా 500 శాతంగా ప్రతిపాదించగా, ఇప్పుడు దానిని భారీగా తగ్గించడం భారత్ వంటి దేశాలకు పెద్ద ఉపశమనం కానుంది. రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ.. ఆ దిగుమతులను తగ్గించుకోవడానికి గణనీయమైన చర్యలు తీసుకుంటున్న దేశాలకు ఈ బిల్లులో ప్రత్యేక మినహాయింపు ఇచ్చారు. దీనివల్ల జపాన్, ఫ్రాన్స్, హంగేరి, బెల్జియం వంటి దేశాలకు ప్రయోజనం చేకూరనుంది. సెనేట్ వర్గాల సమాచారం ప్రకారం.. రష్యా క్రూడాయిల్‌ను అత్యధికంగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్, చైనా, స్లోవేకియా, హంగేరి, అజర్‌బైజాన్ ఉన్నాయి. అలాగే రష్యా గ్యాస్‌ను ఎక్కువగా కొనుగోలు చేసే దేశాల్లో చైనా, ఫ్రాన్స్, జపాన్, హంగేరి, బెల్జియం ముందువరుసలో ఉన్నాయి.

**రష్యా 'షాడో ఫ్లీట్'.. బ్యాంకులపై గురి!**

టారిఫ్‌ల తగ్గింపుతో ఇతర దేశాలకు ఊరటనిచ్చినప్పటికీ, రష్యాపై కఠిన చర్యలను మాత్రం ఈ బిల్లులో కొనసాగించారు. పాశ్చాత్య దేశాల నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రష్యా రహస్య ఆయిల్ ట్యాంకర్ల వ్యవస్థ పై ఆంక్షలు విధించనున్నారు. రష్యా సెంట్రల్ బ్యాంక్‌తో సహా అక్కడి కీలక ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకున్నారు. రష్యాకు చెందిన ప్రతిష్టాత్మక ఇంధన ప్రాజెక్టులైన యామల్ ఎల్ఎన్‌జీ , ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ (Arctic LNG 1, 2, 3)లపై గట్టి నిఘా ఉంచనున్నారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అవసరమని భావిస్తే.. రష్యాపై విధిస్తున్న ఆంక్షలను తాత్కాలికంగా నిలిపివేసే లేదా మినహాయింపులు ఇచ్చే విచక్షణాధికారాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఈ బిల్లు కల్పించింది. సౌత్ కరోలినా రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం, డెమొక్రాటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ సంయుక్తంగా 2025 ఏప్రిల్‌లో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే.. ఇటీవల ఉక్రెయిన్ పర్యటనలో ఉన్నప్పుడు అధ్యక్షుడు ట్రంప్‌తో ఈ బిల్లుపై ఒప్పందం కుదిరిందని ప్రకటించిన మరుసటి రోజే లిండ్సే గ్రాహం ఆకస్మికంగా మరణించారు. ప్రస్తుతం ఈ బిల్లుకు ఇరు పార్టీల నుంచి బలమైన మద్దతు లభిస్తోంది.



## చీఫ్ ఇంజినీర్ రవీందర్‌కు రిమాండ్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజినీర్ రవీందర్‌కు ఏసీబీ ప్రత్యేక కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఆయనను కోర్టు ముందు ప్రవేశపెట్టారు. ఇరువర్గాల వాదనలు విన్న జడ్జి ఈ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రవీందర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

**నివాసాలు, కార్యాలయాల్లోనూ తనిఖీలు**

ఇటీవల రవీందర్ నివాసాలు, కార్యాలయాలు, అలాగే ఆయన బంధువులకు చెందిన పలు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఈ తనిఖీల్లో భారీగా అక్రమ ఆస్తులు, నగదు, బంగారు ఆభరణాలు, కీలక దస్త్రాలను గుర్తించారు. అనంతరం స్వాధీనం చేసుకున్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అంతేకాదు కీలకమైన ఆధారాలు లభించాయి. దీంతో ఆయనను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.

**మరింత సమాచారం రాబట్టేందుకు..**

అయితే రవీందర్ నుంచి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఏసీబీ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసే యోచన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరు సూత్రధారుల వివరాలు సేకరించేందుకు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# ప్రభుత్వ మెగా ప్లానుకు బ్రేకులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మహానగరంలో నానాటికీ పెరిగిపోతున్న కాలుష్యానికి అడ్డుకట్ట వేయడంతో పాటు, నగర నడిబొడ్డున దశాబ్దాలుగా విస్తరించి ఉన్న పారిశ్రామిక ప్రాంతాలను సరికొత్తగా ఆధునీకరించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'హిల్ట్' పాలసీ ఆశించిన ఫలితాలను సాధించలేకపోయింది. నగర శ్రేయస్సును, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నివాస ప్రాంతాల మధ్యలో ఉన్న కాలుష్య కారక ఫ్యాక్టరీలను ఔటర్ రింగ్ రోడ్ అవతలికి తరలించేందుకు రూపొందించిన ఈ ప్రణాళికకు పారిశ్రామిక వర్గాల నుండి స్పందన కరువైంది. నగరవ్యాప్తంగా ఉన్న మొత్తం 22 కీలక పారిశ్రామిక వాడలలో దాదాపు 9,292 ఎకరాల భారీ విస్తీర్ణంలో విస్తరించి ఉన్న 2,800 పరిశ్రమలను తరలించేందుకు ప్రభుత్వం విధించిన తుది గడువు జూన్ 30తో ముగిసిపోయినప్పటికీ, ఇప్పటివరకు అధికారులకు అందిన దరఖాస్తుల సంఖ్య కేవలం 50 మార్కును కూడా దాటకపోవడం ఈ ప్రతిష్టాత్మక విధానంపై పారిశ్రామికవేత్తలలో ఉన్న అనాసక్తిని స్పష్టం చేస్తోంది.

**రియల్ ఎస్టేట్ మహిమ**

పరిశ్రమల యాజమాన్యాలు ఇంతగా వెనకడుగు వేయడానికి ప్రధాన కారణం ఓఆర్ఆర్ లోపల ఉన్న భూముల మార్కెట్ విలువ ఊహించని రీతిలో ఆకాశాన్ని తాకడమేనని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగర పరిధిలోని పారిశ్రామిక భూములు రియల్ ఎస్టేట్ పరంగా అత్యంత విలువైనవిగా మారాయి. ఐటీ హబ్‌లు, నివాస గృహ సముదాయాలు, కమర్షియల్ మాల్స్ నిర్మాణానికి ఈ భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రభుత్వం పాత ఎస్ఆర్ఓ ధరల ప్రాతిపదికన భూముల మార్పిడి ప్రక్రియను చేపడతామని, ఓఆర్ఆర్ అవతల ప్రత్యామ్నాయ భూములు కేటాయిస్తామని భారీ రాయితీలు ఆశ చూపినప్పటికీ, ప్రస్తుత మార్కెట్ ధరలతో పోలిస్తే ప్రభుత్వ ప్యాకేజీ తమకు ఏమాత్రం లాభసాటిగా లేదని యాజమాన్యాలు భావిస్తున్నాయి. కోట్ల రూపాయల విలువ చేసే నగర ప్రాంత భూములను వదులుకుని, మౌలిక వసతులు ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందని ఓఆర్ఆర్ అవతలి సుదూర ప్రాంతాలకు వెళ్లి, అక్కడ మళ్లీ కొత్తగా ప్లాంట్లు నిర్మించుకోవడం ఆర్థికంగా భారీ నష్టంతో కూడుకున్న వ్యవహారమని పారిశ్రామికవేత్తలు వాదిస్తున్నారు.

**మెగా ప్లానుకు బ్రేకులు.. నెక్స్ట్ ఏంటీ?**

ఈ మెగా ప్లాన్ మొదటి దశలోనే అట్టర్ ఫ్లాప్ కావడంతో సర్కారు తీవ్ర సందిగ్ధంలో పడింది. నగరంలో కాలుష్యాన్ని తగ్గించాలనే పట్టుదల ఒకవైపు, పారిశ్రామికవేత్తల నుండి వస్తున్న సహాయ నిరాకరణ మరోవైపు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారాయి. పారిశ్రామిక అసోసియేషన్లతో చర్చలు జరిపి, అప్లికేషన్ గడువును మరికొంత కాలం పొడిగించడమా, లేక ఓఆర్ఆర్ లోపలి భూములను కమర్షియల్ లేఅవుట్లుగా మార్చుకునేందుకు మరిన్ని వెసులుబాట్లు కల్పిస్తూ పాలసీలో సమూల మార్పులు-చేర్పులు చేయడమా అనే అంశంపై సచివాలయ వర్గాల్లో ఉన్నతాధికారులు ఉమ్మడిగా కసరత్తులు ప్రారంభించారు. ఏదేమైనప్పటికీ, వేల కోట్ల విలువైన ఈ మెగా ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్ట్ మొదటి అడుగులోనే తడబడటం అటు పర్యావరణ ప్రేమికులను, ఇటు ప్రభుత్వ యంత్రాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది.

# కాలేజీ గుర్తింపు రద్దు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని స్కూళ్లు, కాలేజీల్లో డ్రగ్స్ మాటే వినపడకుండా చేసేందుకు తెలంగాణ పోలీసు శాఖ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టబోతోంది. ఇకపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని పక్కాగా అమలు చేయనున్నట్లుగా డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ఒకవేళ ఏ విద్యాసంస్థలోనైనా డ్రగ్స్ విక్రయాలు, వినియోగం జరిగినట్లుగా తేలితే, సదరు సంస్థల గుర్తింపును రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. ఇవాళ డీజీపీ సీవీ ఆనంద్ ఈగల్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో డీజీపీ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ప్రతి క్యాంపస్‌లో ప్రత్యేక నిఘా కమిటీలు..**

అయితే, ఈ ఉన్నత స్థాయి సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్ పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో తప్పనిసరిగా డ్రగ్స్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల రక్షణను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి విద్యాసంస్థలో ఓ స్పెషల్ కో-ఆర్డినేటర్‌ను నియమించడం తప్పనిసరి అని తెలిపారు. విద్యార్థులు కాలేజీల్లో చేరే సమయంలోనే డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలని.. ఇందుకోసం సైకాలజిస్టులు, నిపుణుల సేవలను వినియోగించుకోవాలని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

**ఉమ్మడి కార్యాచరణకు ఆదేశం..**

ఈగల్ అధికారులు రూపొందించిన ముసాయిదా ప్రజెంటేషన్‌ను పరిశీలించిన డీజీపీ సీవీ ఆనంద్ విధివిధానాల్లో కొన్ని మార్పులను సూచించారు. పోలీస్, విద్యా, ఆరోగ్య శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేస్తూ సమగ్రమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ తయారు చేయాలని ఆదేశించారు. త్వరలోనే దీనిపై మరో సమావేశం నిర్వహించి తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. భవిష్యత్తు పౌరులను తీర్చిదిద్దే విద్యా సంస్థల్లో డ్రగ్స్‌కు ఏమాత్రం చోటు లేదని, ప్రతి విద్యార్థికి సురక్షితమైన, డ్రగ్స్ రహిత వాతావరణాన్ని అందించడమే మా ప్రాధాన్యత అని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో 'ఈగల్' డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐజీ పద్మజా రెడ్డి, ఎస్పీ గిరిధర్ సహా పలువురు సీనియర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# చైనాతో పోటీగా తెలంగాణ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ ఫ్యూచర్ సిటీని ప్రభుత్వం అభివృద్ధి చేయాలని అనుకుంటుందన్నారు. అభివృద్ధిలో భాగంగానే అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఫ్యూచర్ సిటీకి వచ్చే పెట్టుబడులకు, పరిశ్రమలకు ఇది మంచి ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచంలోనే అత్యంత అధునాతన నగరంగా నిర్మించాలని అనుకున్నట్టు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్ 500లోని కంపెనీలను ఆహ్వానిస్తున్నామని అన్నారు. గతేడాది గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేసి 108 దేశాల నుండి పరిశ్రమలను ఆహ్వానించినట్టు చెప్పారు. తన టీంలోని మంత్రులు ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. 2034 వరకు 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని సాధించడమే తన లక్ష్యం అని తెలిపారు. 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. 2047 వరకు భారత ప్రభుత్వం 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని లక్ష్యంగా పెట్టుకుందని అందులో 10శాతం జీడీపీ తెలంగాణ నుండి ఉండాలన్నారు. అది సాధించాలంటే పెట్టుబడులు కావాలని, వసతులు కావాలని నిరుద్యోగం పోవాలన్నారు. అందుకోసమే తమ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ పాలసీని తీసుకువచ్చిందన్నారు.తెలంగాణ రైజింగ్ పాలసీలో ప్రముఖ విద్యావేత్తలను, వ్యాపారవేత్తలను చేర్చామని చెప్పారు. పరిశ్రమలకు సింగిల్ విండోలోనే అన్ని అనుమతులు ఇస్తామన్నారు. రాబోయే 14ఏళ్లలో 7మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని అమెజాన్ భావిస్తోందని కానీ తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు అది సరిపోదన్నారు. 2034 వరకు ఫ్యూచర్ సిటీలో లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలని కోరారు. అందుకోసం మీకు ఎలాంటి సహాకారం కావాలన్నా అందిస్తామని అన్నారు. మంత్రులు, అధికారులను సంప్రదించి మీకు ఏం కావాలన్నా అడగొచ్చని చెప్పారు. తాను దీనిపై తరచూ రివ్యూ నిర్వహిస్తానని అన్నారు. ఒక పాలసీ లేకపోతే రాష్ట్రం అభివృద్ధి జరగదని అన్నారు. అందుకే తెలంగాణను అభివృద్ధి చేసేందుకే పాలసీలను రూపొందించామన్నారు. రాష్ట్రానికి ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ, మెడికల్ పాలసీ, స్పోర్ట్స్ పాలసీ, ఎనర్జీ పాలసీ, టూరిజం పాలసీలు ఉన్నాయని చెప్పారు. నిరుద్యోగాన్ని పోగొట్టేందుకు స్కిల్ యూనివర్సిటీని తీసుకువచ్చామన్నారు. 2047 నాటికి భారత్ వంద సంవత్సరాల స్వతంత్ర ఉత్సవాలను జరుపుకోబోతుందని ఆ నాటికి దేశ జీడీపీలో తెలంగాణ జీడీపీ 10 శాతం ఉండేలా పనిచేస్తున్నామని అన్నారు.ఇందులో భాగంగానే అధికారులు, మంత్రులు నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. అమెజాన్ డేటా సెంటర్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి మైలురాయిగా మారుతుందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వచ్చినప్పుడు ఇది సాధ్యం కాదని చాలా మంది అన్నారని కానీ ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఫార్మా కంపెనీలు, ఐటీ కంపెనీలు వచ్చాయన్నారు. కానీ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చాలంటే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలంటే నగరంలోని పరిశ్రమలను తరలించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో మెట్రో విస్తరణ జరగాలని, ఇంధనంతో నడిచే ఆర్టీసీ బస్సులను నగరం వెలుపలకు తరలించి ఈవీ బస్సులను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. నగరంలో ఎవరు ఈవీ వాహనాలు కొన్నా జీరో ట్యాక్స్ విధించేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.అదే విధంగా మూసీని ప్రక్షాళన చేసి కాలుష్యం లేకుండా చేస్తామని తెలిపారు. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, పరిశ్రమల తరలింపును కోర్ అర్బన్ రీజియన్‌గా పేరు పెట్టుకున్నామని అన్నారు. కోర్ అంటే క్యూర్ అని.. 2073 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాన్ని కాలుష్యం నుండి క్యూర్ చేయడమే తమ లక్ష్యం అని చెప్పారు. క్యూర్ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్ గా రీడిజైన్ చేస్తామని అన్నారు. అవుటర్ రింగ్ రోడ్డు బయటవైపు, రీజినల్ రింగ్ రోడ్డకు ఇవతల వైపు 10కిమీలు మ్యాన్యుఫ్యాక్చరింగ్ జోన్ గా నిర్ణయించామన్నారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతులను ప్రభుత్వం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుందని తెలిపారు. రైతులకు నష్టం జరగకుండా నష్ట పరిహారం అందిచాలని అధికారులకు సూచిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.





ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# మీ వెంటే ఉంటా

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన జవహర్ నగర్ డంప్ యార్డ్ వ్యతిరేక పోరాట అఖిలపక్ష నేతలు, జేఏసీ నాయకులు మరియు స్థానిక ప్రజలు. జవహర్ నగర్ డంప్ యార్డ్‌కు వ్యతిరేకంగా తాము చేస్తున్న సుదీర్ఘ ఆందోళనకు పార్టీలకు అతీతంగా నాయకత్వం వహించాలని వారు ఈ సందర్భంగా ఎంపీ ఈటల గారిని కోరారు. 20 ఏళ్లుగా తాము చెత్త కుప్పల మధ్య, కాలుష్య కోరల్లో నరకప్రాయమైన జీవితాన్ని అనుభవిస్తున్నామని స్థానికులు ఎంపీ ఈటల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితి నుంచి విముక్తి లభించాలంటే ఈటల రాజేందర్ గారి నాయకత్వమే స రైనదని వారు స్పష్టం చేశారు. ఇటీవల డంప్ యార్డ్‌కు వ్యతిరేకంగా నిరసనలు తెలిపిన వారిని పోలీసులు అక్రమంగా స్టేషన్‌లో నిర్బంధించినప్పుడు, ఎంపీ ఈటల రాజేందర్ గారే స్వయంగా వచ్చి మద్దతు ప్రకటించారని, కష్టకాలంలో తమకు సంఘీభావం తెలిపినందుకు ఈటల కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజే శారు.ప్రస్తుత ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గారు గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో.. జవహర్ నగర్ డంప్ యార్డ్‌ను ఇక్కడి నుండి పూర్తిగా తరలిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని పలువురు నేతలు విమర్శించారు.జవహర్ నగర్ మరియు దాని పరిసర ప్రాంతాల ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ఇప్పుడు ఎంపీ ఈటల రాజేందర్ పైనే ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆపను, మీ వెంటే ఉంటా: ఎంపీ ఈటల రాజేందర్ భరోసా అఖిలపక్ష నేతలు, జేఏసీ ప్రతినిధుల వినతిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందించారు. జవహర్ నగర్ డంప్ యార్డ్ బాధితులకు సంఘీభావం తెలుపుతూ, ఈ పోరాటంలో తాను ముందుండి నడుస్తానని స్పష్టమైన భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాజకీయ పార్టీలను, జెండాలను పక్కనబెట్టి స్థానిక ప్రజలంతా ఏకతాటిపైకి రావడం అభినందనీయం. ఈ న్యాయమైన పోరాటానికి నా సంపూర్ణ మద్దతు ఉంటుంది.డంప్ యార్డ్ చుట్టూ నివసిస్తున్న వారంతా తెలంగాణ పల్లెల నుండి వలసవచ్చిన నిరుపేదలే. వారి ఆరోగ్యంతో ప్రభుత్వం ఆటలాడుకోకూడదు.డంప్ యార్డ్ వ్యతిరేక ఉద్యమంపై నేను నిరంతరం కొట్లాడుతూనే ఉన్నాను. గతంలో ముఖ్యమంత్రిని కలిసినప్పుడు దీనికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ఇక్కడ కరెంటు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. గత వారం కూడా మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి, గతంలో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం పనులు జరగాలని ఆదేశించాను. కానీ పాలకులు, అధికారులు మాట తప్పడం వల్లే నేడు జవహర్ నగర్ పరిసర ప్రాంతాలు మూసీ నది కంటే అధ్వాన్నంగా మారి, ఒక విషవలయాన్ని తలపిస్తున్నాయి.నేటి పాలకులకు ప్రజల బాధలు వినే తీరిక, ఓపిక లేదు. జేఏసీ నేతలు నిరసనకు పిలుపునివ్వగానే అక్రమ అరెస్టులకు దిగడం దుర్మార్గం. అరెస్టులు చేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావు. ప్రజాశక్తి ముందు ఎంతటివారైనా తలవంచాల్సిందే.నాపై గతంలో దాదాపు 200 కేసులు పెట్టారు. ప్రజా ఉద్యమాల్లో నడిచిన నాకు ఈ కేసులు, జైళ్లు కొత్తేమీ కాదు. ధర్మం, న్యాయం కోసం ఆకాశమే హద్దుగా పోరాడే తత్వం నాది. నేను ఒక్కసారి రంగంలోకి దిగితే వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. కానీ, మన పోరాటం శాంతియుతంగా ఉండాలి, ఎక్కడా ఆస్తులను తగులబెట్టాల్సిన అవసరం లేదు. భయపడే వాళ్లనే భయపెడతారు, మనం భయపడాల్సిన పనిలేదు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు.. గతంలో మీరే ఈ డంప్ యార్డుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో కేసు వేశారు. ప్రశ్నించే గొంతుకగా నిలిచారు. ఇప్పుడు మీరే అధికారంలో, సమస్యను పరిష్కరించే స్థానంలో ఉన్నారు. కాబట్టి ఇకనైనా తాత్సారం చేయకుండా వెంటనే పరిష్కారం చూపించండి.జవహర్ నగర్ ప్రజల బాధలను దేశ రాజధానిలో వినిపిస్తాను. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఈ డంప్ యార్డ్ అంశంపై ప్రత్యేకంగా మాట్లాడుతాను. ఇక్కడి నుండి డంప్ యార్డు ను పూర్తిగా తొలగించే వరకు మన పోరాటం ఆగదు. ఈ సమస్యకు ముగింపు పడేంత వరకు నేను మీలో ఒకడిగా ఉంటూ నాయకత్వం వహిస్తాను.. అని ఎంపీ ఈటల రాజేందర్ గారు స్థానికులకు బలమైన భరోసా ఇచ్చారు.

# కేంద్ర కేబినెట్ విప్లవాత్మక నిర్ణయాలు

**న్యూ ఢిల్లీ :** దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా, మౌలిక వసతుల రంగాన్ని పరుగులు పెట్టించేలా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్, ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో మొత్తం 7 ప్రధాన నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. అందుక సంబంధంచిన నిర్ణయాల వివరాలను కేంద్ర సమాచార, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. ముందుకుగా వారణాసిలో సరికొత్త పద్ధతిలో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు కేబినెట్ మొదటి రెండు నిర్ణయాల ద్వారా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వరుణ నది ఒడ్డున ర్యాంప్‌లు, లూప్‌లతో కూడిన 43.218 కిలోమీటర్ల పొడవైన 6/4 లేన్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. ఇక నేషన్ హైవే 31 ని, వారణాసి రింగ్ రోడ్‌తో లింక్ చేసే ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రూ.10,998.32 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్నారు.

**గ్లోబల్ టెక్ హబ్‌గా భారత్ - సెమికాన్ 2.0, మొబైల్ PLI**

అదేవిధంగా సాంకేతిక రంగంలో దేశాన్ని అగ్రభాగాన నిలిపేందుకు కేబినెట్ మరో మూడు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. సెమికాన్ మిషన్ 2.0లో భాగంగా దేశీయంగా చిప్‌ల తయారీని ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన 'ఇండియా సెమికాన్ మిషన్' రెండో విడతకు కేబినెట్ ఏకంగా రూ.1.27 లక్షల కోట్లను మంజూరు చేసింది. ఇక దేశాన్ని మొబైల్ ఉత్పత్తి హబ్‌గా మార్చే లక్ష్యంతో, మొబైల్ ఫోన్ ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ రెండో విడత కోసం రూ.62,500 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. ఎరువుల కొరత లేకుండా దేశాన్ని యూరియా ఉత్పత్తిలో స్వావలంబన వైపు నడిపించేందుకు నూతన 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ ఫర్ యూరియా'కు ఆమోదముద్ర వేశారు.

**రైల్వే నెట్‌వర్క్ ఆధునికీకరణ..**

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణాన్ని మరింత వేగవంతం చేసేందుకు, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచేందుకు కేబినెట్ ఆఖరి రెండు నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పలు ప్రధాన మార్గాల్లో రైల్వే ట్రాక్‌ల డబ్లింగ్, నాలుగో రైల్వే లైన్ నిర్మాణ పనులను భారీ ఎత్తున చేపట్టేందుకు ప్రతిపాదనలను ఆమోదించారు. అయితే, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాలతో దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం సరికొత్త పుంతలు తొక్కనుంది. మౌలిక వసతుల కల్పన, రైల్వేల ఆధునికీకరణతో పాటు సెమీ కండక్టర్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధించడమే కాకుండా లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



వానలు పడాలే
దండిగా వానలు పడాలే
ధరణి మురవాలే
వానలు పడాలే
వాగు వంకలు నిండాలే!!
పచ్చని పైరు పంటలు పండాలే
చెరువులు నిండాలే
చేపలు దండిగా ఉండాలే
బావులు నిండాలే
బాగా పంటలు పండాలే!!
కర్షకుని కష్టాలు తీరాలే
కర్షకుడు కడుపు నిండా తినాలే
ధరణిలో దండిగా పంటలు
పండాలే
అవనిలో అందరూ మురవాలే!!
పల్లెలు పచ్చగా ఉండాలే
పశువుల గాసం దొరకాలే
బాగా వానలు పడాలే
బంగారు పంటలు పండాలి
వానతో వ్యవసాయం ముందుకు
సాగాలి
ధరణిలో జనమంతా సంతోషంగా
ఉండాలే !!

**దేవులపల్లి రమేశ్ (కవి, రచయిత )**
**కలం : వామిక శ్రీ వర్ష**
**నంగునూర్, సిద్దిపేట జిల్లా**
**9963701294.**

# పాలమూరుకు కొత్త ఊపు







**దివిటిపల్లి,ఫ్లాష్ ఇండియా :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే శుభవార్త వినబోతున్నట్టు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు చెప్పారు. ఈ ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ఒప్పించి అనుమతులు సాధించే దిశగా ముందుకు వెళుతున్నట్టు ప్రకటించారు. డిండి ప్రాజెక్టుకు సంబంధించి 30 టీఎంసీల నీటి కేటాయింపులపైన కూడా సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో స్థాపించిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి గారు ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, "కృష్ణా పరివాహక ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న డిండి, పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి, బీమా నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఆర్డీఎస్ ప్రా-జెక్టులను పూర్తి చేసుకోవడానికి, సమస్యలను పరిష్కరించుకోవడానికి పక్క రాష్ట్రంతో సంప్రదింపులు జరుపుతున్నాం" అని చెప్పారు. "ఈ ప్రాజెక్టులకు సంపూర్ణమైన అనుమతులను సాధించి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యత తీసుకుంటా. ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డనే. నేను ఈ పాలమూరు జిల్లా వాడిగా అత్యంత వెనుకబడిన ఈ జిల్లాను అత్యంత అభివృద్ధి చెందిన ఆదర్శవంతమైన జిల్లాగా అభివృద్ధి చేసుకుందాం.." అని జిల్లా వాసులకు పిలుపునిచ్చారు. విద్య, నీటిపారుదల, పారిశ్రామాభివృద్ధికి సంబంధించి ప్రాధాన్యతగా పరిగణించి పాలమూరు జిల్లాలో ట్రిపుల్ ఐటీ, ఇంజనీరింగ్ కాలేజీలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రతి నియోజకవర్గానికి ఏటీసీలు తీసుకొచ్చినట్టు తెలిపారు. "పెట్టుబడులకు సంబంధించి గత ప్రభుత్వాలు అమలు చేసిన విధానాల్లో ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా ఉంటే వాటిని మార్చకుండా మరింత మెరుగుపరిచి పాలసీలను తెచ్చాం. పెట్టుబడులను ఆకర్షించడానికి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను నిర్దేశించాం. టూరిజం, ఎనర్జీ, మెడికల్, స్పోర్ట్స్ పాలసీను తీసుకొచ్చాం. తెలంగాణ రైజింగ్ విజన్‌కు అమర రాజా సంస్థ మద్దతుగా నిలవాలి.." అని కోరారు. "పారిశ్రామికంగా అభివృద్ధి సాధించడానికి పాలమూరు జిల్లాలో చాలా మంది రైతులు భూములు ఇచ్చారు. పరిశ్రమలు అత్యధిక ఉద్యోగాలు ఈ ప్రాంతం వారికే ఇవ్వాలి. చిన్న సహాయాన్ని కూడా జీవితాంతం గుర్తుపెట్టుకునే ఇక్కడ ప్రజలను అక్కున చేర్చుకోవాలి.." అని కోరారు. "వాతావరణంలో శరవేగంగా మార్పులొస్తున్నాయి. ఎల్‌నినో కారణంగా రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యాన్ని తగ్గించుకుని కాలుష్య రహిత దేశంగా ఈ దేశాన్ని తీర్చిదిద్దాలంటే వాహన కాలుష్యాన్ని నియంత్రించాలి. అందుకు ఈవీ వాహనాలను వినియోగం పెరగాలి.ఈవీ బ్యాటరీలు ప్రాధాన్యత పెరిగింది. ఈ నేపథ్యంలో 32 గిగాబైట్ సామర్థ్యం కలిగిన యూనిట్ అమర రాజా స్థాపించడం సంతోషం. అమర రాజా సంస్థలో 700 ఉద్యోగుల్లో 400 మంది మహిళలు ఉండటం గర్వకారణం" అని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. "పాలమూరు జిల్లాలో నూతనంగా పరిశ్రమను ఏర్పాటు చేసి.. స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రయత్నం చేస్తున్న అమర రాజా యాజమాన్యాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. 1983లో అమర రాజా యాజమన్యం చిత్తూరులో ప్రారంభించి.. దాదాపు 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో బయట రాష్ట్రం, బయట మహబూబ్‌నగర్ జిల్లాలో పెట్టడం మనకందరికీ గర్వకారణం."అమర రాజా సంస్థ ప్రపంచంతో పోటీపడే సంస్థ. లోకల్ టాలెంట్‌తో గ్లోబల్ సంస్థలతో పోటీ పడుతున్న అమర రాజా సంస్థతో పోటీ పడే సంస్థ ఈ దేశంలో ఏదీ లేదు. చైనా, జపాన్, జర్మనీతో.. కొన్ని అంశాల్లో సౌత్ కొరియాతో పోటీపడుతుంది. దేశాలనే ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తోంది" అని అమర రాజా సంస్థను అభినందించారు."ప్రపంచంలో ఎంత అభివృద్ధి చెందిన దేశమైనా, ఈవీ బ్యాటరీలు, ఈవీ వాహనం కావాలన్నా, ఈవీకి సంబంధించిన ఏ ఉత్పత్తయినా చైనా మీద ఆధారపడుతుంది. చైనా లీడర్ ఆఫ్ ఈవీ ప్రొడక్ట్స్. అలాంటి దేశంతో పోటీపడటానికి ప్రయత్నం చేస్తున్న అమర రాజా యాజమాన్యాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.." అని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, జూపల్లి కృష్ణా రావు గారు, వాకిటి శ్రీహరి గారు, అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్ గారు, ఎంపీ డీకే అరుణ గారు, ప్రభుత్వ విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డి గారు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారితోపాటు అధికారులు పాల్గొన్నారు.


# ఎస్ఐఆర్ గడువు పొడిగింపు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. బూత్ స్థాయి అధికారులు ఇప్పటికే జూన్ 25 నుంచి ప్రారంభించిన ఇంటింటి సర్వే ప్రక్రియ ఆగస్టు 3 వరకు కొనసాగుతుందని ప్రకటించింది. దీనికి సంబంధించి సరికొత్త షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితా అధికారికంగా విడుదల కానుంది. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు, మార్పులు-చేర్పులకు సంబంధించిన అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం నెల రోజుల పాటు గడువునిచ్చింది. ప్రజలు ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు తమ దరఖాస్తులను సమర్పించే అవకాశం కల్పించారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలకు సంబంధించిన నోటీసుల జారీ, వాటి పూర్తి స్థాయి పరిష్కార ప్రక్రియను ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 వరకు అధికారులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ ప్రాసెస్ అంతా ముగిసిన తర్వాత తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా ప్రకటించనున్నారు.

**రాజకీయ పార్టీల అభ్యర్థనలు..**

కాగా, తెలంగాణ వ్యాప్తంగా ఓటరు సవ-రణ ప్రక్రియ నత్తనడకన కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రతినిధి బృందం కోరింది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కూడా ప్రజలకు కొన్ని ప్రాంతాల్లో ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు కూడా అందలేదంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లగా వారు కేంద్ర ఎన్నికల సంఘానికి అభ్యర్థనలు పంపారు. ఈ క్రమంలోనే షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు జూలై 24 వరకు ఉండగా.. తాజాగా రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు గడువును ఆగస్టు 3 వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.



# కేజీవీబీలో మ్యాథ్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**రాజంపేట్,ఫ్లాష్ ఇండియా :** రాజంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గెస్ట్ మాథ్స్ పోస్టుకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్పెషల్ ఆఫీసర్ బి.శ్రీవాణి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ బీఎస్సీ (ఎంపీసీ), బీఈడి ( మాథ్స్ ) చేసి టెట్ క్వాలి ఫై అయినవారు ఈనెల 17వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు కేజీబీవీ రాజంపేటలో దరఖాస్తులు అందించాలన్నారు. అర్హులైన, అనుభవం కలిగిన మహిళ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు.

# మార్పు తెచ్చేది చదువొక్కటే..

**కొత్తకోట,ఫ్లాష్ ఇండియా :** కుటుంబాలలో ఆనందం నింపేది, మనుషుల జీవితాలను మార్చేది కేవలం చదువొక్కటేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో నూతనంగా నిర్మించిన బాలికల హైస్కూల్‌ను మంత్రులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థ పునర్నిర్మాణంపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**అందుకే విద్యాశాఖను నా దగ్గర..**

విద్య ప్రాధాన్యతను గుర్తించే తాను విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని సీఎం తెలిపారు. గత పదేళ్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ బడుల్లో కనీస సదు-పాయాలు కరువయ్యాయని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఒకే కుటుంబం కీలక శాఖలన్నింటినీ తమ గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటు వెనుక విద్యార్థుల ఉద్యమాలు, ఆత్మబలిదానాలు ఉన్నాయని.. రాజకీయ నాయకుల వల్ల కాకుండా విద్యార్థుల వల్లే తెలంగాణకు చట్టబద్ధత వచ్చిందని గుర్తుచేశారు. వారి త్యాగాలకు ప్రతిరూపంగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేయడమే తన ఆకాంక్ష అన్నారు.

**ప్రైవేట్ బడులకు ధీటుగా ప్రభుత్వ బడులు**

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు పూర్తి స్థాయి అర్హతలు, అనుభవం ఉన్నాయని.. అదే ప్రైవేట్ స్కూళ్లలో ఉపాధ్యాయులకు సగం అర్హతలు కూడా ఉండవని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్లే విద్యార్థులు ప్రైవేట్ బడుల వైపు వెళ్లాల్సి వచ్చిందని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతామని, మార్పు అనేది రాత్రికి రాత్రి రాకపోయినా ఒక మంచి అడుగైతే ముందుకు పడాల్సిందేనని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ముందుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల సమస్యలన్నింటినీ పరిష్కరించామని రేవంత్ రెడ్డి తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్రంలోని లక్షకు పైగా ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తున్నారని.. ప్రభుత్వం కూడా విద్యపై ఏడాదికి రూ.30 కోట్లు ఖర్చు చేస్తోందని వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల గతంలో దేశంలో తెలంగాణ పాఠశాలలు 35వ స్థానంలో ఉండేవని, తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఇప్పుడు ఆ స్థానాన్ని 18వ ర్యాంకుకు తీసుకురాగలిగామని సీఎం వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో వైట్ కాలర్ ఉద్యోగాలు తగ్గిపోతున్నాయని.. అందుకే తమ ప్రభుత్వం సాంకేతిక నైపుణ్యాలతో కూడిన బ్లూ కాలర్ ఉద్యోగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని సీఎం పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీఐ కేంద్రాలను త్వరలోనే అత్యాధునికంగా తీర్చిదిద్దనున్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

## సంపాదకీయం





# నోరు అదుపులో లేక..

రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో పెద్ద సంక్షోభాలకు కారణమయ్యేది భారీ నిర్ణయాలు కావు. ఒక చిన్న పొరపాటు, ఒక వ్యాఖ్య, ఒక ఫ్లెక్సీ లేదా ఒక ఫోన్ సంభాషణ కూడా అనూహ్య పరిణామాలకు దారి తీస్తుంది. తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు కూడా అదే విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక ఫ్లెక్సీలో స్థానిక నేత ఫొటో లేకపోవడం నుంచి ప్రారంభమైన వివాదం... ఇప్పుడు పార్టీ క్రమశిక్షణ, సామాజిక సమీకరణాలు, నాయకత్వ విశ్వసనీయత, రాజకీయ సంస్కృతి వరకు వెళ్లి చేరింది. మొదట చూస్తే ఇది ఒక స్థానిక స్థాయి విభేదంలా కనిపించింది. ఫ్లెక్సీలో ఎవరి ఫొటో ఉండాలి? ఎవరి ఫొటో లేకపోయింది? అనే అంశం సాధారణంగా స్థానిక రాజకీయాల్లో అప్పుడప్పుడూ కనిపించే వ్యవహారమే. కానీ ఆ చిన్న వివాదం తర్వాత బయటకు వచ్చినట్లు చెప్పబడుతున్న ఫోన్ సంభాషణలు మొత్తం వ్యవహారాన్ని కొత్త మలుపు తిప్పాయి. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి మాట్లాడినట్లు ప్రచారంలోకి వచ్చిన ఆడియోలో కొన్ని సామాజిక వర్గాలను కించపరిచే వ్యాఖ్యలు ఉన్నాయన్న అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై యాదవ, గౌడ సామాజిక వర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తమైంది. ఈ అంశంపై అధికారికంగా దర్యాప్తు జరగాల్సి ఉన్నప్పటికీ, రాజకీయంగా ఇప్పటికే నష్టం జరిగిపోయిందనే అభిప్రాయం వినిపిస్తోంది. అయితే అసలు వివాదం అక్కడితో ఆగలేదు. ఆ తర్వాత శివచరణ్ రెడ్డి తండ్రి, కాంగ్రెస్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడినట్లు ప్రచారంలోకి వచ్చిన మరో ఆడియో మరింత పెద్ద చర్చకు దారితీసింది. అందులో యూత్ కాంగ్రెస్ పదవి కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేశానని వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరిగింది. అదే సమయంలో పార్టీ అగ్రనాయకత్వం, పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి పేర్లు కూడా సంభాషణలో ప్రస్తావనకు వచ్చినట్లు సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో చర్చ సాగింది. ఈ ఆడియోల ప్రామాణికతపై ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ లేదు. జక్కిడి ప్రభాకర్ రెడ్డి వాటిని కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో తయారు చేసినవిగా పేర్కొంటూ ఖండించారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరైనా మనస్తాపానికి గురైతే క్షమాపణలు కూడా తెలిపారు. మరోవైపు శివచరణ్ రెడ్డి కూడా బీసీ వర్గాలకు వ్యతిరేకం కాదని, తనపై దుష్ప్రచారం జరుగుతోందని చెబుతూ క్షమాపణలు చెప్పారు. అయినప్పటికీ వివాదం రాజకీయంగా పూర్తిగా చల్లారిందని చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీకి మూడు ప్రధాన సందేశాలను ఇస్తోంది. మొదటిది... సామాజిక సమీకరణాల ప్రాధాన్యం. తెలంగాణ రాజకీయాల్లో బీసీ వర్గాలు కీలక ఓటు బ్యాంకు. ముఖ్యంగా యాదవ, గౌడ, ముదిరాజ్, మున్నూరు కాపు వంటి వర్గాల మద్దతు ప్రతి ప్రధాన పార్టీకి అవసరం. అలాంటి సమయంలో ఏ నాయకుడి వ్యాఖ్యలు అయినా ఆ వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్న అభిప్రాయం ఏర్పడితే దాని ప్రభావం కేవలం ఒక వ్యక్తిపైనే కాదు, మొత్తం పార్టీపై పడే అవకాశం ఉంటుంది. అందుకే బీసీ నాయకులు పార్టీ అధిష్ఠానాన్ని కలిసి చర్యలు కోరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రెండోది... పదవులపై పారదర్శకత. పదవుల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్న వ్యాఖ్యలు నిజమా? సందర్భోచితంగా చెప్పిన మాటలా? లేక వక్రీకరించబడినవా? అనే అంశం అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. ఎందుకంటే రాజకీయ పార్టీల్లో పదవులు అర్హత ఆధారంగా వస్తాయన్న ప్రజల నమ్మకాన్ని ఇలాంటి ప్రచారాలు దెబ్బతీసే ప్రమాదం ఉంది. అవి నిజం కాకపోయినా, అలాంటి అభిప్రాయం ఏర్పడటం కూడా పార్టీలకు ఇబ్బందికరమే. మూడోది... సోషల్ మీడియా యుగంలో రాజకీయ బాధ్యత. గతంలో ఒక నాయకుడు చేసిన వ్యాఖ్యలు పరిమిత వర్గాలకే తెలిసేవి. ఇప్పుడు ఒక ఆడియో, ఒక వీడియో, ఒక స్క్రీన్‌షాట్ క్షణాల్లో లక్షల మందికి చేరుతోంది. అది నిజమా? ఎడిట్ చేశారా? ఏఐతో రూపొందించారా? అనే చర్చ తర్వాత వస్తుంది. కానీ అప్పటికే రాజకీయ నష్టం జరిగిపోతుంది. అందుకే రాజకీయ నాయకులు ప్రతి మాట విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం పెరిగింది. ఈ వివాదంలో మరో ఆసక్తికర అంశం పార్టీ అధిష్ఠానం స్పందించిన తీరు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ జిల్లా పార్టీ నాయకత్వానికి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. అంటే ఈ వ్యవహారాన్ని పార్టీ సాధారణ విభేదంగా కాకుండా క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా పరిగణిస్తున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ వ్యవహారంపై ఆరా తీసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దీనిపై అధికారిక ప్రకటనలు పరిమితంగానే ఉన్నప్పటికీ, పార్టీ ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించలేదని మాత్రం స్పష్టమవుతోంది. అయితే ప్రశ్న ఒక్కటే. క్షమాపణలతో వివాదం ముగిసిపోతుందా? రాజకీయాల్లో క్షమాపణలు అవసరమే. కానీ అవి ప్రజల్లో ఏర్పడిన సందేహాలను పూర్తిగా తొలగిస్తాయని చెప్పలేం. ముఖ్యంగా కులపరమైన వ్యాఖ్యలు, పార్టీ పదవులపై వచ్చిన ఆరోపణలు వంటి అంశాల్లో కేవలం క్షమాపణ కంటే వాస్తవాలను నిర్ధారించే ప్రక్రియ కూడా అంతే ముఖ్యమైనది. విచారణ జరుగుతుందా? ఆడియోల ప్రామాణికతపై స్పష్టత వస్తుందా? పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందా? అనే అంశాలే ఈ వివాదానికి తుది ముగింపును నిర్ణయిస్తాయి. ఈ ఘటన కాంగ్రెస్‌కు ఒక రాజకీయ పాఠాన్ని కూడా చెబుతోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ ముందున్న అతిపెద్ద సవాలు ప్రతిపక్షాన్ని ఎదుర్కోవడం మాత్రమే కాదు; పార్టీలో అంతర్గత సమన్వయాన్ని కాపాడుకోవడం కూడా. స్థానిక స్థాయి విభేదాలు, వ్యక్తిగత ప్రతిష్ఠ, సామాజిక వర్గాల సున్నితత్వం, సోషల్ మీడియా ప్రభావం ఈ నాలుగు అంశాలను సమతుల్యం చేయగలిగితేనే అధికార పార్టీగా తన విశ్వసనీయతను నిలబెట్టుకోగలదు. చివరికి ఈ వివాదం ఒక ఫ్లెక్సీతో ప్రారంభమైంది. కానీ ఇప్పుడు అది రాజకీయ కమ్యూనికేషన్, పార్టీ క్రమశిక్షణ, సామాజిక సమీకరణాలు, నాయకత్వ బాధ్యతలపై పెద్ద చర్చకు దారి తీసింది. ఈ వివాదం క్షమాపణలతో ముగుస్తుందా? లేక పార్టీ సంస్థాగత నిర్ణయాలతో మరో మలుపు తిరుగుతుందా? అన్నది రానున్న రోజుల్లో తేలుతుంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పొచ్చు ఈ ఘటన తెలంగాణ రాజకీయాలకు మరోసారి ఒక వాస్తవాన్ని గుర్తు చేసింది. రాజకీయాల్లో చిన్న పొరపాటు కూడా పెద్ద రాజకీయ సంక్షోభానికి దారి తీసే అవకాశం ఎప్పుడూ ఉంటుంది.

# రాజకీయ లెక్కలా?

తెలంగాణ రాజకీయాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు పేరు వినిపించిన ప్రతిసారీ అభివృద్ధి, అవినీతి, రాజకీయ ఆరోపణలు, పరిపాలనా వైఫల్యాలు అన్నీ ఒకేసారి చర్చకు వస్తాయి. అధికారంలో ఉన్నప్పుడు అది రాష్ట్ర గర్వకారణమని చెప్పిన పాలకులు ఉన్నారు. అదే ప్రాజెక్టును ప్రతిపక్షంలో ఉన్నప్పుడు "అవినీతికి ప్రతీక"గా అభివర్ణించిన వారే ఇప్పుడు అధికారంలో ఉన్నారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రతి పరిణామం కేవలం ఇంజినీరింగ్ అంశంగా కాకుండా రాజకీయ అంశంగా కూడా మారుతోంది. ఈ నేపథ్యంలో కొండపోచమ్మ సాగర్‌పై విజిలెన్స్ శాఖ నిర్వహించిన విచారణ నివేదిక ఇప్పటికీ ప్రభుత్వానికి అధికారికంగా చేరలేదన్న ప్రచారం కొత్త చర్చకు తెరలేపుతోంది. కొండపోచమ్మ సాగర్ సాధారణ రిజర్వాయర్ కాదు. దాదాపు రూ. 1,600 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో కీలక భాగం. ఐదు జిల్లాలకు సాగునీరు, హైదరాబాద్‌కు తాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ రిజర్వాయర్ వేలాది మంది రైతుల ఆశలకు ప్రతీక. అలాంటి ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణ జరిగి, నివేదిక సిద్ధమైందని సమాచారం వచ్చిన తర్వాత సహజంగానే ప్రజలు దాని ఫలితాల కోసం ఎదురుచూస్తారు. కానీ విచారణ పూర్తై నెలలు గడుస్తున్నా నివేదిక ప్రభుత్వానికి చేరలేదన్న ప్రచారం అనుమానాలకు తావిస్తోంది. ఈ పరిస్థితిని రాజకీయ కోణంలో పరిశీలిస్తే రెండు ప్రధాన ప్రశ్నలు ఎదురవుతున్నాయి. మొదటిది నివేదిక నిజంగానే పెండింగ్‌లో ఉందా? రెండోది ఉంటే దానికి కారణం ఏమిటి? అధికారిక సమాచారం లేకపోవడం వల్ల ఈ రెండు ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేవు. అయితే సమాధానాల లేమే ఇప్పుడు ఊహాగానాలకు కారణమవుతోంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో తలెత్తిన సమస్యల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులోని పలు అంశాలపై విచారణలకు ఆదేశించింది. ఆ విచారణల ఆధారంగా కొందరు అధికారులపై పరిపాలనా చర్యలు కూడా తీసుకుంది. దీనితో ప్రభుత్వం అవినీతిపై రాజీపడబోదన్న సంకేతం ఇచ్చింది. అదే సమయంలో కాళేశ్వరం పరిధిలోని ఇతర నిర్మాణాలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని నిర్ణయించింది. కొండపోచమ్మ సాగర్ కూడా అదే ప్రక్రియలో భాగమైంది. సమాచారం ప్రకారం విజిలెన్స్ బృందం గత ఏడాది ప్రాజెక్టును పరిశీలించి, సాంకేతిక, పరిపాలనా అంశాలపై నివేదిక సిద్ధం చేసింది. ఆ నివేదిక యూనిట్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు చేరిందని ప్రచారం జరుగుతోంది. అయితే అక్కడి నుంచి ప్రభుత్వం వరకు వెళ్లే ప్రక్రియలో ఆలస్యం జరుగుతోందన్న సమాచారం వినిపిస్తోంది. ఈ ప్రచారంపై ఇప్పటివరకు అధికారిక స్పష్టత లేకపోవడం సమస్యను మరింత సంక్లిష్టం చేస్తోంది. ఇక్కడ ఒక ముఖ్యమైన అంశాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్యంలో విచారణ అంటే కేవలం లోపాలను గుర్తించడం మాత్రమే కాదు. ఆ నివేదికను సంబంధిత ప్రభుత్వానికి అందించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకునేలా చేయడం కూడా అంతే కీలకం. విచారణలు పూర్తయినా నివేదికలు ఫైళ్లలోనే ఉంటే ప్రజల్లో విచారణ వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటుంది. పారదర్శక పాలన అంటే కేవలం విచారణలకు ఆదేశాలు ఇవ్వడం కాదు; వాటి ఫలితాలను కూడా ప్రజల ముందుంచడం. రాజకీయంగా చూస్తే ఈ అంశం అధికార పార్టీకి కూడా పరీక్షే. ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ ప్రకటించింది. ఆ హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, కొండపోచమ్మ సాగర్ వ్యవహారంలో మాత్రం జాప్యం కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విమర్శలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వకపోతే ప్రతిపక్షాలకు అది రాజకీయ ఆయుధంగా మారే అవకాశం ఉంది. ఇంకో ఆసక్తికర అంశం అధికారుల ప్రమోషన్ల చుట్టూ తిరుగుతోంది. కొండపోచమ్మ సాగర్ విచారణలో కొందరు అధికారులు బాధ్యులుగా ప్రస్తావించబడ్డారన్న సమాచారం ప్రచారంలో ఉంది. అయితే నివేదిక ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో వారిపై ఎలాంటి చర్యలు లేవన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ప్రమోషన్లలో కూడా కొందరికి పదోన్నతులు లభించాయన్న ప్రచారం చర్చనీయాంశమైంది. ఈ ప్రచారం నిజమా కాదా అన్నది పక్కన పెడితే, ఇలాంటి పరిస్థితి ఏర్పడకుండా ఉండాలంటే ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇక్కడ పరిపాలనా వ్యవస్థ పాత్ర కూడా కీలకం. విజిలెన్స్ వంటి సంస్థలపై ప్రజలు నమ్మకం ఉంచేది వాటి స్వతంత్రత, నిష్పాక్షికత వల్లే. అలాంటి సంస్థల నివేదికలు ఆలస్యమైతే రాజకీయ జోక్యం జరిగిందన్న అనుమానాలు సహజంగానే వస్తాయి. అలాంటి అనుమానాలకు తావులేకుండా వ్యవహరించడం ప్రభుత్వంతో పాటు విజిలెన్స్ శాఖ బాధ్యత కూడా. అయితే మరో కోణాన్ని కూడా విస్మరించకూడదు. పెద్ద ప్రాజెక్టులకు సంబంధించిన విచారణలు సాంకేతికంగా క్లిష్టంగా ఉంటాయి. ఒక నివేదికను తుది రూపంలో ప్రభుత్వం ముందుంచే ముందు పలు స్థాయిల్లో పరిశీలన జరిగే అవకాశం ఉంటుంది. అవసరమైతే న్యాయపరమైన అభిప్రాయాలు కూడా తీసుకుంటారు. అలాంటి ప్రక్రియల వల్ల కొంత ఆలస్యం జరగడం అసాధారణం కాదు. కానీ ఆ కారణాన్ని అధికారికంగా వెల్లడిస్తే అనవసర ప్రచారానికి తావుండదు. అదే చేయకపోవడం వల్లే అనుమానాలు పెరుగుతున్నాయి. రాజకీయాల్లో ఒక విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. సమాచారం లేకపోతే ఊహాగానాలే సమాచారంగా మారిపోతాయి. ప్రస్తుతం కొండపోచమ్మ సాగర్ వ్యవహారంలో కూడా అదే జరుగుతోంది. నివేదిక ఎక్కడ ఉంది? ప్రభుత్వం వద్ద ఉందా? ఇంకా విజిలెన్స్ స్థాయిలోనే ఉందా? కమిషన్ పరిశీలనలో ఉందా? అనే ప్రశ్నలకు అధికారిక సమాధానం లేకపోవడంతో అనేక కథనాలు ప్రచారంలోకి వస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పటికే తెలంగాణ రాజకీయాల్లో భావోద్వేగ అంశంగా మారింది. ఒకవైపు ఇది రైతులకు నీటిని అందించిన ప్రాజెక్టుగా చెప్పబడుతోంది. మరోవైపు నిర్మాణ నాణ్యత, వ్యయ భారం, పరిపాలనా నిర్ణయాలపై తీవ్రమైన విమర్శలు వచ్చాయి. ఈ రెండు కథనాల మధ్య నిజానిజాలను నిర్ధారించే బాధ్యత విచారణ సంస్థలపై ఉంది. అందుకే విజిలెన్స్ నివేదికలు రాజకీయ ప్రచారానికి అతీతంగా, వాస్తవాలను మాత్రమే ప్రతిబింబించాలి. కొండపోచమ్మ సాగర్ వ్యవహారం ఇప్పుడు ప్రభుత్వం ముందు ఒక అవకాశాన్ని కూడా ఉంచుతోంది. నివేదిక సిద్ధంగా ఉంటే వెంటనే ప్రభుత్వానికి సమర్పించి, అందులోని అంశాలపై చట్టబద్ధమైన నిర్ణయాలు తీసుకోవాలి. ఒకవేళ నివేదిక ఇంకా పరిశీలనలో ఉంటే ఆ విషయాన్ని బహిరంగంగా వెల్లడించాలి. ప్రజాస్వామ్యంలో పారదర్శకత అంటే ప్రజల సందేహాలకు సమాధానం చెప్పడం కూడా. ఈ అంశం మరో పెద్ద సందేశాన్ని ఇస్తోంది. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయలతో చేపట్టిన మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేవలం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు మాత్రమే కాదు; నిర్మాణ నాణ్యత, ఆర్థిక క్రమశిక్షణ, పరిపాలనా జవాబుదారీతనం కూడా అంతే ముఖ్యమైనవి. విచారణలు కూడా అదే లక్ష్యంతో జరగాలి. అవి రాజకీయ ప్రతీకారంగా కనిపించకూడదు. అదే సమయంలో ఫలితాలు లేకుండా కాలయాపన చేసే ప్రక్రియగా కూడా మారకూడదు. ప్రభుత్వాలు మారడం సహజం. రాజకీయ ఆరోపణలు కూడా సహజమే. కానీ ప్రజాధనం మాత్రం అందరిదీ. అందుకే ప్రజల డబ్బుతో నిర్మించిన ప్రతి ప్రాజెక్టుపై వచ్చిన అనుమానాలను పారదర్శకంగా నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. కొండపోచమ్మ సాగర్ విజిలెన్స్ నివేదిక వ్యవహారం ఇప్పుడు అదే జవాబుదారీతనాన్ని పరీక్షిస్తోంది. చివరికి ప్రజలు కోరేది ఒక్కటే నివేదిక ఉంటే బయటపెట్టాలి. తప్పు జరిగితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. తప్పు జరగలేదంటే అదే విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. మౌనం మాత్రం ఏ ప్రభుత్వానికీ మేలు చేయదు. పారదర్శకతే ప్రజల విశ్వాసాన్ని నిలబెడుతుంది. కొండపోచమ్మ సాగర్ నివేదిక చుట్టూ నెలకొన్న సందిగ్ధతను నివృత్తి చేయడం ద్వారా ప్రభుత్వం ఆ విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే అవకాశం ఇప్పటికైనా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.

# బాధ్యతలు కొండంత.. వేతనం అంతంత!



ఒక దేశ భవిష్యత్తు దాని చిన్నారుల చేతుల్లో ఉంటే, ఆ చిన్నారుల భవిష్యత్తుకు తొలి పునాది వేసేది అంగన్‌వాడీ వ్యవస్థ. తల్లి తర్వాత ఒక చిన్నారి జీవితాన్ని అత్యంత ప్రభావితం చేసే వ్యక్తి అంగన్‌వాడీ టీచరే. అక్షరాభ్యాసం నుంచి ఆహారపు అలవాట్ల వరకు, ఆరోగ్య సంరక్షణ నుంచి సామాజిక ప్రవర్తన వరకు చిన్నారుల ఎదుగుదలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మల పాత్ర ఎంతో కీలకమైనది. అయినప్పటికీ, భావితరాన్ని తీర్చిదిద్దుతున్న ఈ సేవకులకు దక్కుతున్న గౌరవం, ఆర్థిక భరోసా మాత్రం వారి బాధ్యతలకు ఏమాత్రం సరితూగడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం ప్రీ-స్కూల్ విద్యా కేంద్రాలు మాత్రమే కావు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, టీకాలు, శిశు అభివృద్ధి వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలకు ఇవే కేంద్రబిందువు. పిల్లలకు పోషకాహారం అందించడం, వారి ఎదుగుదలను నమోదు చేయడం, గర్భిణులకు ఆరోగ్య సూచనలు ఇవ్వడం, ప్రభుత్వ సర్వేలు నిర్వహించడం, ఇంటింటి సందర్శనలు చేయడం, డిజిటల్ యాప్‌లలో సమాచారం నమోదు చేయడం వంటి అనేక బాధ్యతలను అంగన్‌వాడీ సిబ్బంది నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వంలోని పలు శాఖల కార్యక్రమాలకు కూడా వారే క్షేత్రస్థాయిలో వారధిగా నిలుస్తున్నారు. ఈ బాధ్యతలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, వారికి అందుతున్న గౌరవ వేతనం మాత్రం పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా లేదు. నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల విద్య, వైద్య ఖర్చులు, ఇంటి అద్దెలు, రవాణా వ్యయాలు విపరీతంగా పెరిగిన ఈ కాలంలో అంగన్‌వాడీ సిబ్బంది చాలామంది ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ ఆయమ్మల పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. పిల్లలకు ఆహారం తినిపించడం, కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచడం, వంటపాత్రలు శుభ్రం చేయడం, చిన్నారులను తల్లిలా చూసుకోవడం వంటి శారీరకంగా కష్టమైన పనులు చేస్తున్నప్పటికీ, వారికి లభిస్తున్న వేతనం అత్యల్ప స్థాయిలో ఉండటం విచారకరం. ప్రభుత్వాలు మహిళా సాధికారత, బాలల సంక్షేమం, మానవ వనరుల అభివృద్ధి గురించి తరచూ మాట్లాడుతున్నాయి. కానీ ఆ లక్ష్యాలను భూమిపై అమలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది సంక్షేమాన్ని అదే స్థాయిలో పట్టించుకోవడం లేదన్న భావన నెలకొంది. కేవలం గౌరవ వేతనాన్ని కొద్దికొద్దిగా పెంచడం ద్వారా సమస్య పరిష్కారం కాదు. వారి సేవలను గుర్తించి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన భరోసా కల్పించాల్సిన సమయం ఆసన్నమైంది. వేతనాల పెంపుతో పాటు ఉద్యోగ భద్రత, పదవీ విరమణ అనంతరం పెన్షన్, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, సామాజిక భద్రత వంటి అంశాలను ప్రభుత్వం ప్రాధాన్యంగా పరిగణించాలి. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పిల్లలకు అనువైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. ఆధునిక బోధనా సామగ్రి, డిజిటల్ సదుపాయాలు, అవసరమైన శిక్షణ కూడా అందుబాటులో ఉండాలి. అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేయడం అంటే కేవలం ఉద్యోగుల సంక్షేమం మాత్రమే కాదు. అది భావితరంపై పెట్టుబడి. బాల్య దశలో సరైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, విద్య లభిస్తేనే ఆరోగ్యవంతమైన, విద్యావంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది. ఆ లక్ష్యాన్ని సాధించడంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలు చేస్తున్న సేవలు అమూల్యమైనవి. ప్రభుత్వాలు వారిని కేవలం గౌరవ వేతనం తీసుకునే సిబ్బందిగా కాకుండా, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే భాగస్వాములుగా గుర్తించాలి. వారి సమస్యలను పరిష్కరించడం సంక్షేమ కార్యక్రమం మాత్రమే కాదు, సామాజిక బాధ్యత కూడా. భావితరానికి పునాది వేస్తున్న చేతులకు ఆర్థిక భరోసా, సామాజిక గౌరవం కల్పించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. చిన్నారుల భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి గౌరవప్రదమైన జీవనం కల్పించడం ప్రభుత్వాల ప్రాధాన్య బాధ్యతగా మారాల్సిన సమయం ఆసన్నమైంది.

# సహకార బ్యాంకుల పాలక మండళ్ల సమావేశం




**మేడ్చల్,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గంలోని కిష్టాపూర్ డివిజన్, అత్వెల్లిలోని జీఎన్ఆర్ (GNR) ఫంక్షన్ హాల్‌లో సహకార బ్యాంకుల పాలక మండళ్ల ఏర్పాటుకు సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార బ్యాంకులకు చైర్మన్‌లు, డైరెక్టర్లను నామినేటెడ్ విధానంలో నియమిస్తూ పాలక మండళ్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సహకార బ్యాంకులకు పాలక మండళ్ల ఏర్పాటు ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పాలక మండళ్లలో చైర్మన్, డైరెక్టర్ పదవులను ఆశిస్తున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు, పేర్లను స్వీకరించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సమావేశానికి పెద్దపల్లి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చింతకుంట్లవిజయరమణరావు మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మెన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి గారు, జిల్లా ఓబీసీ చైర్మెన్ రవి ముదిరాజ్, RTA మెంబెర్ జైపాల్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యాక్షులు వేముల మహేష్ గౌడ్, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ శిరీష రెడ్డి, బాలు రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి సత్యనారాయణ, డిసిసి ప్రధాన కార్యదర్శి బీపీటీ రాజు, కిష్టాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చాపరాజు, గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, ఎల్లంపేట మున్సిపాలిటీ అధ్యక్షుడు విగ్నేశ్వర రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం డివిజన్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ నాయకులు, సహకార సంఘాల ప్రతినిధులు, పదవులు ఆశిస్తున్న అభ్యర్థులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యాదాద్రి పవర్ ప్లాంట్ లో కమీషన్ల దందా..

## ప్రతినెల రూ. 10 లక్షల వరకు వసూళ్లు...?

**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా :** పవర్ ప్లాంటు నిర్మాణంలో వేలాది మంది కార్మికులు నిత్యం నిమగ్నమై పనిచేస్తున్నారు. కార్మికులను సరఫరా చేయడానికి కొంత మంది కాంట్రాక్టర్లు పవర్ ప్లాంటులో ఉన్నారు. ప్లాంటు లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన ఓ అధికారి ఆ కాంట్రాక్టర్ నుంచి ప్రతి నెల కమీషన్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ కమీషన్ ఆలస్యమైన, ఇవ్వకపోయిన రకరకాల కారణాలు చెప్పి పని ముందుకు సాగకుండా అడ్డుపడుతుంటారని తెలుస్తోంది. రక్షణగా ఉండాల్సిన అధికారులే దోచుకుంటుంటే ఎవరికి చెప్పుకోవాలో అర్థం కానీ స్థితిలో కాంట్రాక్టర్లు పనిచేస్తున్నారు. కంచె చేను మేసినట్లుగా అక్కడ వసూళ్ల దందా కొసాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**నిర్మాణంలో 5వేల మంది కార్మికులు...**

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటు ( వైటిపిఎస్) నల్లగొండ జిల్లాలోని దామరచర్ల మండలంలోని వీర్ల పాలెం/ తాళ్ల వీరప్పగూడెంలో ఏర్పాటు చేశారు. ఇది పూర్తిగా భారీ బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రం . దీని మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 4వేల మెగవాట్లు. అంటే మొత్తం ఐదు యూనిట్లు. ఐదు యూనిట్లు.. ఒక్కొక్కటి 800 యూనిట్లు చొప్పున విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఇలాంటి పెద్ద ప్రాజెక్టు నిర్మాణంలో90 నుంచి 100 మంది కాంట్రాక్టర్లు ఉన్నారు. ప్రస్తుతం సుమారు 4 నుంచి 5వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అనేక వాహనాలు కూడా ఈ పనిలో ఉపయోగిస్తుంటారు. అయితే ప్లాంటులో పనిచేస్తున్న కార్మికులకు, వాహనాలకు ఇన్-- అవుట్ ( లోపలికి వచ్చి పోవడానికి) పాసులు ప్రతి నెలకు ఒకసారి అందజేస్తుంటారు. గతంలో మూడు నెలలకు ఒకసారి ఇచ్చే వారు. కానీ గత కొద్ది రోజులుగా నెలకు ఒక్కసారి మాత్రమే ఇస్తున్నారు. ప్లాంటులో బయటివారు లోపలికి ఎవరూ రాకుండా అనుమతి లేకుండా వస్తే గుర్తించడానికి ఈ కార్డులను ఉపయోగిస్తుంటారు.

**కాంట్రాక్టర్ నుంచి వసూళ్లు.....**

థర్మల్ పవర్ ప్రాజెక్టు పనిలో మొత్తం సుమారు 90 మంది 100 మంది కాంట్రాక్టర్లు ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్లకు సంబంధించిన కార్మికులు, వాహనాలు, తదితర వాటికి గేటు పాసులు తప్పని సరి. అయితే ఆ పాసులు ఇవ్వాలంటే ప్లాంటుకు రక్షణ కల్పించే స్థానంలో అధికారి ఆదేశాల మేరకు అందజేస్తుంటారు. అయితే పాసులు అందచేసే ముందు ప్లాంటులో పనిచేసే కాంట్రాక్టర్ల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. కాంట్రాక్టర్ స్థాయిని బట్టి రూ. 5వేల నుంచి 12వేల వరకు వసూలు చేస్తున్నట్లు వినికిడి. అంటే 100మంది కాంట్రాక్టర్ల నుంచి రూ. 5వేలు వసూలు చేస్తేనే ప్రతి నెలకు రూ. 5లక్షలు అవుతుంది. అంటే దాదాపు ఆ కీలక అధికారికి ప్రతినెల రూ. 5 నుంచి 10 లక్షల వరకు అక్రమ సంపాదన అందుతుందని ప్లాంటులో పెద్దఎత్తున ప్రచారం జరుగుతుంది. గతంలో మూడు నెలలకు ఒకసారి మాత్రమే గేటు పాసులు ఇచ్చేవారు.. కానీ అక్రమ సంపాదన తగ్గుతుందనే దురాలోచనతో ప్రతి నెల కార్డులు అందజేసే విధానాన్ని అ అధికారి అమలు చేసినట్లు చర్చ జరుగుతుంది. ఆ కీలక అధికారి కాంట్రాక్టర్ల నుంచి అక్రమ వసూళ్లలో సూత్రధారి అయితే అందులో పనిచేసే మరో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు పాత్రధారులు తమ పనిని కొనసాగిస్తూ వసూళ్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**పెత్తనమంతా ఆయనదే....?**

ఆయన ఓ కాంట్రాక్టర్ కాదు... రక్షణ శాఖలో పనిచేసే ఉద్యోగి కాదు.... విద్యుత్ ప్లాంటులో పనిచేసే ఇంజనీరు కాదు.. కనీసం లేబర్ పని కూడ చేయడు. కానీ అక్కడ పెత్తనమంతా ఆయనే చెలాయిస్తుంటారు. ఆయన రక్షణ శాఖలో ఉన్న కీలక అధికారికి నిత్యం నీడలా వెన్నంటి ఉంటారని చర్చ జరుగుతుంది. అక్రమంగా వసూలు చేసే సొమ్ములో కీలక సూత్రధారికి .. ముగ్గురు పాత్రధారులకు మధ్య నారాదుడి పాత్ర పోషిస్తున్నట్లు వినికిడి. ఏ కాంట్రాక్టర్ నుంచి ఎంత వసూలు చేయాలో అతనే నిర్ణయిస్తారని తెలుస్తోంది. వీళ్లిద్దరి మధ్య సంబందం రక్షణ శాఖ అధికారి గతంలో పనిచేసిన చోటు నుంచి వీరి బంధం కొనసాగుతున్నట్లు సమాచారం. ఆ బందాన్ని అడ్డుపెట్టుకుని పవర్ ప్లాంటులో అందరిపై పెత్తనం చేస్తారని సమాచారం. అంతేగాకుండా అధికారితో ఉన్న సంబందంతో సబ్ కాంట్రాక్ట్ పనులు ఇప్పిస్తామని కూడ డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

# ఘనంగా సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికెల శేఖర్ యాదవ్ జన్మదిన వేడుకలు








**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ జన్మదిన వేడుకలు అభిమానుల. నాయకులు కార్యకర్తల. మధ్య ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ కేక్ ను నాయకులు కార్యకర్తలు అనుచరుల మధ్య కేక్ కట్ చేసి. పండ్లు పంపిణీ చేశారు. అనంతరం. ఉప్పల ఆశ్రమ పాఠశాల & కళాశాల నందు 400 మంది విద్యార్థులకు. భోజనం ఏర్పాట్లు చేసిన సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా పుట్టినరోజు వేడుకలను ఉప్పల ఆశ్రమ పాఠశాల మరియు కళాశాల నందు చిన్నారులతో కలిసి జరుపుకోవడం నాకు చాలా సంతృప్తిని ఇచ్చిందని . వారి చిరునవ్వుల్లో కనిపించిన సంతోషం వారితో కలిసి భోజనం చేస్తూ గడిపిన ఈ మధుర క్షణాలు నా జీవితంలో చిరస్మయంగా నిలిచిపోతాయన్నారు. చిన్నారులకు అవసరమైన సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ నూకం కోటేశ్వర్, మాజీ సర్పంచ్ లలితడ జ్యోతయ్య,వార్డు సభ్యుడు వెంకటేష్ యాదవ్, దుర్గా పురం రవి. అఖిల్ మరియు ఆశ్రమ ప్రిన్సిపల్ మరియు లెక్చరర్స్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు

# అర్ధరాత్రి భీకర అగ్నిప్రమాదం





**హస్తినాపురం,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలోని మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందనవనం, శ్రీ రమణ కాలనీలో బుధవారం అర్థరాత్రి సంభవించిన భారీ అగ్నిప్రమాదం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. మెట్రో బార్ ఎదురుగా ఉన్న ప్లాస్టిక్, పాత సామాన్ల గోదాంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు క్షణాల్లోనే తీవ్రరూపం దాల్చి, పక్కనే ఉన్న నివాస గృహానికి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. మంటలు వేగంగా వ్యాపించడంతో గోదాం పూర్తిగా దగ్ధమైంది. గోదాం పక్కనే నివసిస్తున్న శ్రీనివాస్ (40) ఇంటిని కూడా అగ్ని చుట్టుముట్టింది. ఇంట్లో ఉన్న ఫర్నిచర్, ఎల్ఈడీ టీవీ, గృహోపకరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. మూడంతస్తుల భవనం పాక్షికంగా దెబ్బతింది. 30 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఓగ్గు కథలు చెప్పడం, అమ్మవారి పూజలు నిర్వహించడం ద్వారా జీవనం సాగిస్తున్న శ్రీనివాస్ కుటుంబం ఒక్కసారిగా నిరాశ్రయమైంది. ఈ భవనంలో మొత్తం ఏడు కుటుంబాలు నివసిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అర్థరాత్రి మంటలు చెలరేగడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు తీయాల్సి వచ్చిందని వారు వాపోయారు. ఇంటి సామగ్రి అంతా అగ్నికి ఆహుతికావడంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఏడు ఫైర్ ఇంజిన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్లాస్టిక్, పాత సామాన్లు పెద్దఎత్తున నిల్వ ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. దట్టమైన పొగలు ఎగసిపడటంతో పరిసర ప్రాంతమంతా భయానక వాతావరణం నెలకొంది. అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించడంతో మంటలు సమీపంలోని ఇతర ఇళ్లకు వ్యాపించకుండా అడ్డుకోగలిగారు. లేదంటే మరింత పెద్ద విషాదం సంభవించే ప్రమాదం ఉండేదని అధికారులు తెలిపారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది. అగ్నిప్రమాదానికి గల కారణాలపై మీర్పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమా? లేక ఇతర కారణాలున్నాయా? అనే కోణాల్లో అగ్నిమాపక శాఖ అధికారులు కూడా విచారణ చేస్తున్నారు. ఈ ఘటనతో నివాస ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్లాస్టిక్, పాత సామాన్ల గోదాంల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. ఇలాంటి గోదాంలకు అగ్నిమాపక శాఖ అనుమతులు ఉన్నాయా? భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. శ్రీ రమణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఇదే బస్తీలో ఇంకా పదుల సంఖ్యలో పాత సామాన్ల గోదాంలు కొనసాగుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం అందించి, పునరావాసం కల్పించాలని ప్రజాసంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ ఘటన నగర శివారు ప్రాంతాల్లో నివాసాల మధ్య అనుమతులు, భద్రతా ప్రమాణాలను పట్టించుకోకుండా నడుస్తున్న గోదాంలపై అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరాన్ని మరోసారి స్పష్టం చేసింది.

# సీనియర్ న్యాయవాది అల్తాఫ్ హుస్సేన్ మృతికి కల్వకుర్తి కోర్టు న్యాయవాదులు సంతాపం



**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సీనియర్ క్రిమినల్ న్యాయవాది అల్తాఫ్ హుస్సేన్ మృతికి సంతాప సూచికంగా కల్వకుర్తి కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం కోర్ట్ ఆవరణలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కోర్టుకు అందించిన సేవలను న్యాయవాదులు కొనియాడారు. వృత్తి ధర్మాన్ని అంకితభావంతో నిర్వర్తించి, ఎంతోమంది నిరుపేదల మన్ననలు పొందారని న్యాయవాదులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ మల్లేష్, ప్రధాన కార్యదర్శి జమీల్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు వెంకట్ రెడ్డి వెంకట్ గౌడ్ , అమరేందర్, సి .కృష్ణయ్య, వెంకటరమణ, నాగరాజు, జంగయ్య, జయంతి కుమార్, ప్రశాంత్, మల్లేష్ యాదవ్, శ్రీకాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో రౌడీ షీటర్.. సంగారెడ్డిలో బాబా



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లో పోలీసుల నుండి తప్పించుకుని తిరుగుతున్న ఓ రౌడీ షీటర్ సంగారెడ్డిలో బాబా అవతారం ఎత్తాడు. ఏడాదిగా రౌడీ షీటర్ ఆచూకీ దొరక్కపోవడంతో సీపీ సజ్జన్నార్ ఆదేశాలతో రంగంగలోకి దిగిన ఖైరతాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు సంగారెడ్డిలో గుర్తించారు. నకిలీ బాబాను గుర్తించడంతో పాటు అతడి వద్ద 115 గ్రాముల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లేక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ మహ్మద్ షేక్ జావేద్ గతేడాది జూన్ నుండి పరారీలో ఉన్నాడు. నిందితుడు సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో ఏ5గా ఉండగా అతడికి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంజ్ చేసింది. అయితే అరెస్ట్ వారెంట్ నుండి తప్పించుకునేందుకు నిందితుడు బాబా అవతారం ఎత్తాడు. అతడిపై నిఘా పెట్టిన పోలీసులు సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నానా మియా మసీద్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఇంతకాలం నిందితుడు సంగారెడ్డి జిల్లా చెరియాల్‌లో తన అమ్మమ్మ వద్ద ఉంటూ ఓ మసీదులో పూజారిగా పనిచేస్తున్నట్టు గుర్తించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వార్త వైరల్ అవ్వడంతో ఇన్నిరోజులు దొంగబాబాను నమ్మిన భక్తులు షాక్ అవుతున్నారు.

# తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి షోకాజ్ నోటీసులు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డికి జాతీయ యూత్ కాంగ్రెస్ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. మహిళా నేత పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. రెండు రోజుల్లో లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. వివరణ ఇవ్వకపతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇదిలా ఉంటే యాదగిరిగుట్ట పాలకమండలి సభ్యురాలిగా ఈశ్వరమ్మ యాదవ్ పదవీ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా ఎల్బీనగర్ లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలో తన తండ్రి ప్రభాకర్ రెడ్డి ఫోటో వేయలేదంటూ ఈశ్వరమ్మ యాదవ్ మనవుడు సురేష్ యాదవ్‌కు ఫోన్ చేసిన శివచరణ్ రెడ్డి బూతులు తిటనట్టు ఆడియో వైరల్ అవుతోంది. దీంతో బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బీసీ మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేస్తావా అంటూ సంఘాలు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశాయి. శివ చరణ్ రెడ్డిని పదవి నుండి తప్పించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు శివ చరణ్ రెడ్డి తండ్రి ప్రభాకర్ రెడ్డి స్టేట్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పదవి కోసం రూ.7 కోట్లు ఖర్చు చేశామని చెప్పినట్టు మరో ఆడియో వైరల్ అవుతోంది. ఇరువురిపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జాతీయ యూత్ కాంగ్రెస్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

# భర్తను హత్య చేసిన భార్య.. ప్రియుడు అరెస్ట్



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్లగొండ జిల్లా వాడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించి, మృతుడి భార్యతో పాటు ఆమె ప్రియుడిని అరెస్ట్ చేశారు. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను పథకం ప్రకారం హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్డీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం నర్సాపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ గోవింద ఈ నెల 11న తన నివాసంలో మృతి చెందిన ఘటన పై వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని శాస్త్రీయంగా పరిశీలించిన పోలీసులు క్లూస్ టీం స హాయంతో ఆధారాలు సేకరించి, పోస్టుమార్టం నివేదికతో పాటు సాంకేతిక ఆధారాల పై విచారణ కొనసాగించారు. దర్యాప్తులో గోవిందు భార్య ఇస్లావత్ సరోజకు అదే గ్రామానికి చెందిన చెన్నబోయిన శ్రీనుతో గత ఆరు సంవత్సరాలుగా అక్రమ సంబంధం ఉన్నట్లు తేలింది. ఈ విషయం తెలిసిన గోవిందు భార్యను తరచూ నిలదీయడం, ఇటీవల ఆమె మొబైల్ ఫోన్‌ను ధ్వంసం చేయడంతో ఇద్దరి మధ్య విభేదాలు మరింత పెరిగినట్లు పోలీసులు గుర్తించారు.దీంతో గోవిందును హత్య చేయాలని సరోజ, శ్రీను కలిసి ముందస్తు ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడైంది. ఈ నెల 10, 11 తేదీల అర్ధరాత్రి సమయంలో శ్రీను ఇంట్లోకి ప్రవేశించి గోవిందు ముఖంపై దిండు పెట్టి శ్వాస ఆడకుండా బలంగా అదిమిపట్టగా, సరోజ అతని కాళ్లను గట్టిగా పట్టుకుంది. గోవిందు ప్రతిఘటించడంతో శ్రీను పిడిగుద్దులతో దాడి చేయగా, సరోజ ఇంట్లో ఉన్న చెక్క రోకలి బండతో వృషణాలపై బలంగా కొట్టింది. తీవ్ర గాయాలతో గోవిందు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నేరం అనంతరం నిందితులు రక్తపు మరకలు ఉన్న దుస్తులు, హత్యకు ఉపయోగించిన వస్తువులను దాచిపెట్టి పరారయ్యారు. సాంకేతిక ఆధారాలు, విచారణలో లభించిన సమాచారంతో ఈ నెల 14న దామరచర్ల శివారులోని రైల్వే గేట్ సమీపంలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన చెక్క రోకలి బండ, రక్తపు మరకలు ఉన్న దుస్తులు, నోకియా కీప్యాడ్ సెల్‌ఫోన్, రెడ్‌మీ--12 మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపించారు. మిర్యాలగూడ డీఎస్పీ పర్యవేక్షణలో కేసును విజయవంతంగా ఛేదించిన వాడపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి సిబ్బంది జోజి జహీరుద్దీన్ హరినాథ్ మధు ఉదయ్ పూర్ణిమ చౌడమ్మ లను ఎస్పీ అభినందించారు.

# రూ.20 వేలు లంచం డిమాండ్..

**సూర్యాపేట,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ అధికారులు విస్తృతంగా దాడులు చేసి లంచాలు తింటున్న అధికారుల పని పడుతున్నా.. అక్రమార్జనకు మాత్రం అడ్డుకట్టపడటం లేదు. తాజాగా. సూర్యాపేట జిల్లా భూగర్భ జలాల శాఖ కార్యాలయంలో ఇవాళ ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేశారు. రూ.20 వేలు లంచం తీసుకుంటూ జిల్లా గ్రౌండ్ వాటర్ ఆఫీసర్ మేగావత్ బాలు, ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోసనోజు వెంకటేశ్వర్ల ను అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ ఫిర్యాదుదారుడు తన బోరుబావి డ్రిల్లింగ్ రిగ్ అనుమతి కోసం గ్రౌండ్ వాటర్ శాఖను ఆశ్రయించాడు. ఈ క్రమంలోనే అతడికి జరిమానాలు విధించకుండా, రిగ్‌ను సీజ్ చేయకుండా ఉండేలా చూసేందుకు జిల్లా అధికారి మేగావత్ బాలు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. ఆ లంచం మొత్తాన్ని తన ఆఫీస-ంలోని ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకటేశ్వర్లుకు ఇవ్వాల్సిందిగా బాలు సూచించారు. ఈ క్రమంలోనే బాధితుడు ఏసీబీ నల్గొండ రేంజ్ అధికారులను ఆశ్రయించారు. ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం ఇవాళ డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకటేశ్వర్లు బాధితుడి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. లంచం సొమ్మును వెంకటేశ్వర్లు వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. లంచం డిమాండ్ చేసి, అక్రమంగా డబ్బులు వసూలు చేసినందుకు గానూ నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. అనంతరం వారిని నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల మొదటి అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు.

# హోటళ్లకు ఎంఎంసీ కమిషనర్ అల్టిమేటం



**ఉప్పల్,ఫ్లాష్ ఇండియా :** ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే విధంగా హోటళ్లలో మిగిలిన ఆహార వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం లేదా పశువుల, పందుల ఫార్మ్‌లకు తరలిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే హోటళ్లను సీజ్ చేస్తామని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. హబ్సిగూడ చౌరస్తాలోని సుప్రభాత్, అమరావతి హోటళ్లలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కిచెన్‌లను పరిశీలించిన సందర్భంగా మిగిలిన ఆహార వ్యర్థాలను పశువుల, పందుల ఫార్మ్‌లకు అందిస్తున్నట్లు సిబ్బంది వెల్లడించారు. అనంతరం సమీపంలోని పశువుల ఫార్మ్‌ను పరిశీలించిన కమిషనర్, హోటళ్ల నుంచి తీసుకొచ్చిన ఆహార వ్యర్థాలను బహిరంగంగా నిల్వ ఉంచి పశువులకు వే-స్తున్నట్లు గుర్తించారు. ఈ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్, ఇలాంటి చర్యలు దుర్వాసన, కాలుష్యం, వ్యాధుల వ్యాప్తికి దారితీసి ప్రజారోగ్యానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తాయని అన్నారు. నగరంలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు తమ వద్ద ఉత్పత్తి అయ్యే తడి ఆహార వ్యర్థాల నిర్వహణ కోసం తప్పనిసరిగా ఇన్-సిటు బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలని లేదా అధీకృత వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలకు మాత్రమే పంపించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఆహార వ్యర్థాలను అనధికారికంగా పారవేయడం లేదా పశువుల, పందుల ఫార్మ్‌లకు తరలించడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేసిన కమిషనర్, నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లపై కఠిన చర్యలతో పాటు అవసరమైతే సీజ్ కూడా చేస్తామని హెచ్చరించారు. ప్రజారోగ్య పరిరక్షణ, పరిశుభ్రమైన నగర నిర్మాణం, శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణలో అన్ని వాణిజ్య సంస్థలు తమ సామాజిక బాధ్యతను గుర్తించి నిబంధనలను కచ్చితంగా పాటించాలని కమిషనర్ సూచించారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేసిన మాజీ ఎంపిటీసీ నాయకులు శ్రీనివాస మూర్తి

**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో వెల్ జాల్ గ్రామానికి చెందిన తిరుమణి సత్య నారాయణ కు మంజూరైన 60 వేళ్ళ రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును. లబ్దిదారులకు మాజీ ఎంపిటిసి శ్రీనివాస మూర్తి. అందజేశారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, అంజయ్య గౌడ్, ఆంబాజి, వెంకట్ రెడ్డి, బి నర్సింలు, అజీజ్, టి.కృష్ణయ్య గౌడ్ ,వద్దే రాజు, జాఫర్, పులిజాల విష్ణు. ఎండి నసిర్ , జాఫర్, బాలస్వామి, జంగయ్య,తదితరులు పాల్గొన్నారు

# డిజిటలైజేషన్ ప్రక్రియ జాగ్రత్తగా చేయాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ ఆర్డీవో మరియు ఈఆర్వో ా రమణారెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ తో కలిసి మిర్యాలగూడ పట్టణంలో నీ చైతన్య నగర్ పోలింగ్ స్టేషన్ నెంబర్ 114 ను,ప్రకాష్ నగర్‌లోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 131 ను ఎస్ఐఆర్ ప్రక్రియలో(ఇంటింటి సర్వే)భాగంగా తనిఖీ చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియకు సంబంధించి బి ఎల్ ఓకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ మరియు బిఎల్ఓ సూపర్వైజర్ పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యల పై కాంగ్రెస్ నిరసన

**నడిగూడెం,ఫ్లాష్ ఇండియా :** ఎన్నికల్లో ఓటమిపాలైన నాటి నుంచి మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మతి-భ్రమించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి పై తరచూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొక్క బిక్షపతి, వ్యవసా-య మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.అనంతరం మల్లయ్య యాదవ్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, పేదలు, మధ్యతరగతి ప్రజల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ కోదాడ--హుజూర్‌నగర్ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇక పై ముఖ్యమంత్రి, మంత్రి, ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రస్తుత, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై ప్రజలకు అవగాహన కల్పించిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి



**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్‌పై ప్రతి ఒక్కరికి పూర్తి స్థాయిలో అవగహన కల్పించడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో బీఎల్ వోలు, బి ఎల్ ఏ చేపట్టిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు.. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదైన ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు అవసరమైన సవరణలు చేసుకునేలా అవగహన కలిగి ఉండాలని సూచించారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఎస్ఐఆర్ ప్రక్రియన నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబంలోని ఓటర్లు తమ వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో నమోదు చేసి. బి ఎల్ ఓ, బీఎల్ఎలకు అందజేయాలని ఓటర్లకు ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు జి శ్రీనివాసమూర్తి , ఏ.అంజయ్య గౌడ్,ఎం.అంబాజి, బి .నర్సింలు, అజీజ్ , టి కృష్ణయ్య గౌడ్, వి.రాజు, పులిజాల విష్ణు, జాఫర్, అంగన్వాడి టీచర్ లు వసంత లక్ష్మి, భూషణమ్మ, నశ్రీన్ బేగం, బిఎల్వోలు పి చంద్రకళ, బి సుధా,బుక్ కిపర్ కల్పన తదితరులున్నారు

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా వేగవంతంగా చేయాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ మండలంలోని చింతపల్లి గ్రామంలో మరియు మిర్యాలగూడ పట్టణంలోని పలు వార్డ్ లలోనీ బూత్‌లలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)కార్యక్రమాన్ని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బుధవారం ప్రత్యక్షంగా సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి బూత్‌లో నమోదవుతున్న దరఖాస్తులు,ఓటరు వివరాల సవరణ ప్రక్రియ,అర్హులైన ఓటర్ల నమోదు,అవసరమైన ధ్రువపత్రాల పరిశీలన,ప్రజలకు అందుతున్న సేవలపై ఎమ్మెల్యే సమగ్రంగా ఆరా తీశారు. కార్యక్రమం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా మరియు నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం బూత్ లెవల్ అధికారులతో (బిఎల్వో) మాట్లాడిన ఎమ్మెల్యే, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని,ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ,ఎవరూ ఇబ్బందులు పడకుండా సేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎలు) కూడా పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తూ,ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమని,ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా అధికారులు, బిఎల్ఓలు,బి ఎల్ ఎలు సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, సంబంధిత అధికారులు, బిఎల్ఓలు,బిఎల్ఎలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నేర నియంత్రణకు మిర్యాలగూడ పట్టణంలో విస్తృత తనిఖీలు







**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాలపై నిఘా పెంచేందుకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. మిర్యాలగూడ ఇంచార్జ్ డీఎస్పీ రవి పర్యవేక్షణలో 1 టౌన్ సీఐ నాగభూషణ్,2 టౌన్ సీఐ సోమ నర్సయ్య,రూరల్ సీఐ పి.ఎన్.డి ప్రసాద్ లతో కూడిన ముగ్గురు సీఐల ఆధ్వర్యంలో 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పట్టణంలోని ప్రధాన కూడళ్లు,జాతీయ రహదారి మార్గాలు,ప్రవేశ-నిష్క్రమణ ప్రాంతాలు,రద్దీ కూడళ్లు మరియు అనుమానాస్పద ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వాహనాల రిజిస్ట్రేషన్,నంబర్ ప్లేట్లు, డ్రైవింగ్ లైసెన్స్,రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ),ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా సంచరిస్తున్న నంబర్ ప్లేట్ లేని 11 ద్విచక్ర వాహనాలు,సరైన పత్రాలు లేని 27 వాహనాలు సహా మొత్తం 38 వాహనాలను సీజ్ చేశారు. సంబంధిత వాహన యజమానులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. అదేవిధంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను ప్రశ్నించి వారి వివరాలను సేకరించారు. రాత్రి వేళల్లో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు పాత నేరస్థుల కార్యకలాపాలపై కూడా పోలీసులు ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవి మాట్లాడుతూ నేర నియంత్రణ, ప్రజల భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన నంబర్ ప్లేట్,రిజిస్ట్రేషన్,బీమా, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.

మిర్యాలగూడ పట్టణంలో నేర నియంత్రణ లక్ష్యంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరంగా కొనసాగుతాయని డీఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఇసుక టిప్పర్ ఢీకొట్టడంతో తండ్రి కొడుకులకు గాయాలు




**మిడ్జిల్,ఫ్లాష్ ఇండియా :** వ్యవసాయ పొలానికి వెళ్తున్న బైకును ఇసుక టిప్పర్ ఢీకొట్టడంతో తండ్రి కొడుకులకు గాయాలైన సంఘటన మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున మిడ్జిల్ గ్రామానికి చెందిన శాంతయ్య కుమారుడు శ్రీశైలంతో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్తున్నాడు. మిడ్జిల్ -వెల్జాల ప్రధాన రహదారిలో ఎదురుగా వస్తున్న ఇసుక టిప్పర్ వాహనం వీరి బైక్ ను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తండ్రీ కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ వాహన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. పరారీలో ఉన్న టిప్పర్ డ్రైవర్ను టిప్పర్ను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణా టిప్పర్లు అతివేగంగా వెళ్లడంతోనే ప్రమాదం చోటు చేస్తుందని స్థానిక రైతులు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ , డ్రైవర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.




# అదే మా ఓటమికి కారణం..


మంగళవారం ఎడ్జ్‌బాస్టన్‌లో టీమిండియాతో జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ముందుగా ఇంగ్లండ్ 258 పరుగులు చేయగా.. లక్ష్యాన్ని భారత్ 45.2 ఓవర్లలోనే 4 వికెట్స్ కోల్పోయి ఛేదించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యం సాధించింది. మ్యాచ్ అనంతరం ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ జట్టు ప్రదర్శనపై నిరాశ వ్యక్తం చేశాడు. మ్యాచ్‌లో కీలక సమయంలో వరుసగా ఐదు వికెట్లు కోల్పోవడమే తమ పరాజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నాడు. రెండో వన్డేలో మరింత బలంగా తిరిగి వస్తామని, టీమిండియాపై గెలుస్తామని ధీమా వ్యక్తం చేశాడు.'మొదటి వన్డేలో మా ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో 20 పరుగుల వ్యవధిలో ఐదు వికెట్లు కోల్పోవడం మమ్మల్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఆ దశలోనే మ్యాచ్‌పై మేము పట్టును కోల్పోయాం. అయినప్పటికీ చివర్లో జో రూట్, లియామ్ డాసన్ అద్భుత భాగస్వామ్యంతో జట్టును గౌరవప్రదమైన స్కోరు దిశగా తీసుకెళ్లారు. చివర్లో వచ్చిన చిన్నచిన్న భాగస్వామ్యాలు కూడా మాకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఆ పరిస్థితుల్లో 260 పరుగులు చేయడం గొప్ప విషయం. ఈ క్రెడిట్ రూట్, డాసన్‌లకే దక్కుతుంది' అని ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ చెప్పాడు.'260 పరుగుల లక్ష్యాన్ని మా బౌలర్లు కాపాడగలమనే నమ్మకం ఉంది. ఇన్నింగ్స్ విరామ సమయంలో పిచ్ కొంత నెమ్మదించింది. అదే పరిస్థితి కొనసాగితే మా బౌలర్లకు అనుకూలంగా మారుతుందని అనుకున్నాం. కానీ భారత బ్యాటర్లు ఎలాంటి ఒత్తిడికి లోనుకాలేదు. ఐదు నుంచి ఆరు పరుగుల రన్‌రేట్‌తో సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించారు. పిచ్ స్వభావం మారడంతో మా వ్యూహాలు ఆశించిన ఫలితం ఇవ్వలేదు. మేము ఎప్పుడూ పిచ్ పరిస్థితులను బట్టి తుది జట్టును ఎంపిక చేస్తాం. ఈ మ్యాచ్‌లో మరో 60-70 పరుగులు చేసి 320 లేదా 330 స్కోరు సాధించి ఉంటే మా స్పిన్నర్లు మ్యాచ్‌లో మరింత ప్రభావం చూపేవారు. కానీ మిడిల్ ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోవడం వల్ల ఆ అవకాశం లేకుండా పోయింది. అదే మా ఓటమికి ప్రధాన కారణం' అని అన్నాడు.రెండో వన్డేకు ముందు ఆందోళన ఏమీ లేదని బ్రూక్ స్పష్టం చేశాడు. 'ఇప్పుడు మేము కార్డిఫ్‌కు వెళ్తాం. అక్కడ పిచ్‌ను పరిశీలించి జట్టు కూర్పుపై నిర్ణయం తీసుకుంటాం. తొలి మ్యాచ్‌లో చేసిన తప్పులను సరిదిద్దుకుని రెండో వన్డేలో మరింత మెరుగైన ప్రదర్శన చేస్తాం. కచ్చితంగా టీమిండియాను ఓడించడానికే చూస్తాం. సిరీస్‌ను సమం చేయడానికి ప్రయత్నిస్తాం' అని హ్యారీ బ్రూక్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

# మైదానం వీడిన కెప్టెన్.. అసలేమైంది.?



ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో టీమిండియాకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. లక్ష్యఛేదనలో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయంతో ఆట మధ్యలోనే రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాల్సి వచ్చింది. 75 బంతుల్లో 80 పరుగులు చేసిన గిల్ జట్టును విజయపథంలో నడిపిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.ఇన్నింగ్స్ 24వ ఓవర్ సమయంలోనే గిల్ కుడి కాలు వద్ద కాస్త అసౌకర్యంగా ఫీలయ్యాడు. వెంటనే భారత జట్టు ఫిజియో మైదానంలోకి వచ్చి చికిత్స అందించారు. ఆ సమయంలో గిల్‌కు నీరు తాగించి, కుడి కాలి వెనుక భాగంలో స్ట్రెచింగ్ కూడా చేశారు. చికిత్స ఎక్కువసేపు కొనసాగడంతో ఆన్‌ఫీల్డ్ అంపైర్ కుమార్ ధర్మసేన ఆటను త్వరగా కొనసాగించాలని సూచించారు. కొద్దిసేపటి తర్వాత గిల్ మళ్లీ బ్యాటింగ్ కొనసాగించినా, నొప్పి పూర్తిగా తగ్గలేదు.శ్రేయస్ అయ్యర్‌తో కలిసి గిల్ మూడో వికెట్‌కు 101 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే కొద్దిసేపటికే మరోసారి అసౌకర్యానికి గురైన గిల్ తన గ్లౌజులు తొలగించి మైదానంలోనే కూర్చున్నాడు. కుడి కాలి వెనుక భాగాన్ని పట్టుకుని నొప్పితో ఇబ్బంది పడిన తర్వాత రిటైర్డ్ హర్ట్‌గా డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయాడు. ప్రస్తుతం గాయం తీవ్రతపై అధికారిక ప్రకటన రాకపోయినా.. ఇది కండరాలు పట్టేయడం (క్రాంప్స్) వల్ల జరిగి ఉండొచ్చని ప్రాథమిక సమాచారం.లక్ష్యఛేదనలో భారత్ ఇన్నింగ్స్ ప్రారంభంలోనే రోహిత్ శర్మ (11), విరాట్ కోహ్లీ (5) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో జట్టు ఒత్తిడిలో పడింది. ఆ సమయంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేస్తూ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. చూడచక్కని షాట్లతో స్కోర్‌బోర్డును ముందుకు నడిపిస్తూ శ్రేయస్ అయ్యర్‌తో కలిసి జట్టును విజయం వైపు తీసుకెళ్లాడు. అయితే గిల్ రిటైర్డ్ హర్ట్‌గా వెళ్లిన కొద్దిసేపటికే శ్రేయస్ అయ్యర్ 35 పరుగుల వద్ద రన్‌ఔట్ అయ్యాడు. ఆ తర్వాత కేఎల్ రాహుల్ కూడా కేవలం ఒక్క పరుగుకే ఔటవడంతో భారత్‌పై మరోసారి ఒత్తిడి పెరిగింది. ఆ సమయంలో క్రీజ్ లోకి వచ్చిన ఆల్ రౌండర్స్ వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ లు బాధ్యతాయుతంగా ఆడుతూ ఇద్దరూ హాఫ్ సెంచరీలు చేసి ఇంగ్లాండ్ ను మట్టికరిపించారు.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ ఒక దశలో 107/6తో కష్టాల్లో పడింది. అయితే జో రూట్, లియామ్ డాసన్ అర్ధ సెంచరీలతో జట్టును ఆదుకుని 258 పరుగుల గౌరవప్రదమైన స్కోరు అందించారు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ నాలుగు వికెట్లతో రాణించి ఇంగ్లండ్‌ను భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నాడు.

# ఫైనల్‌కు దూసుకెళ్లిన స్పెయిన్





ఫిఫా వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ చివరి దశకు వచ్చేసింది. ఈ టోర్నమెంట్ లో భాగంగా తాజాగా తొలి సెమీ ఫైనల్ జరిగింది. ఇందులో ఫ్రాన్స్, స్పెయిన్ జట్లు తలపడ్డాయి. అయితే ఇందులో అద్భుతంగా రాణించిన స్పెయిన్.. ఫ్రాన్స్ ను ఇంటికి పంపించింది. ఈ మ్యాచ్ లో 0-2 తేడాతో విజయం సాధించిన స్పెయిన్, ఫైనల్ లోకి దూసుకు వెళ్ళింది. దీంతో సోషల్ మీడియాలో స్పెయిన్ జట్టుకు శుభాకాంక్షలు తెలుపుతూ అభిమానులు రచ్చ చేస్తున్నారు. ఇక అర్జెంటీనా, ఇంగ్లాండ్ మధ్య రేపు రెండో సెమీ ఫైనల్ ఉంటుంది. ఇందులో గెలిచిన జట్టు స్పెయిన్ తో ఫైనల్ మ్యాచ్ ఆడనుంది.

**మెగా ఫైనల్ ఎప్పుడు అంటే ?**

ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ జూలై 19వ తేదీన జరగనుంది.

వచ్చే ఆదివారం న్యూ జెర్సీలోని మెట్ లైఫ్ స్టేడియం వేదికగా స్పెయిన్ తో ఇంగ్లాండ్ లేదా అర్జెంటీనా ఫైనల్స్ లో టైటిల్ కోసం తలపడతాయి.



# ఒకే ఫ్రేమ్ లో ముగ్గురు మాజీ కెప్టెన్లు

ఇండియా, ఇంగ్లాండ్ మధ్య మంగళవారం రోజున తొలి వన్డే జరిగింది. టీ20లలో విఫలమైన భారత జట్టు, తొలి వన్డేలో మాత్రం మంచి ఆరంభాన్ని అందుకుంది. గిల్ కెప్టెన్సీ లోని భారత్... ఇంగ్లాండ్ పై ఏకంగా 6 వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. అయితే ఈ మ్యాచ్ నేపథ్యంలో మహేంద్ర సింగ్ ధోని సందడి చేశారు. తొలి వన్డే చూసేందుకు మిస్టర్ కూల్ ధోని స్టేడియానికి వచ్చారు. ఈ సందర్భంగా స్టేడియంలో ప్రేక్షకులతో కలిసి మ్యాచ్ ఎంజాయ్ చేశారు.గాగుల్స్ ధరించి స్టైలిష్ లుక్ లో మెరిశారు. పక్కనే ఓ పిల్లోడు పాప్ కార్న్ ఆఫర్ చేయగా... తీసుకుని తిన్నాడు. ఈ నేపథ్యంలోనే మహేంద్ర సింగ్ ధోని, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లను

ఒకే ఫ్రేమ్ లో పెట్టి టెలికాస్ట్ చేశారు. దీంతో ఒకే ఫ్రేమ్ లో ముగ్గురు మాజీ కెప్టెన్లు ఉన్నారని ఫ్యాన్స్ తెగ సంబరపడిపోతున్నారు. ఈ ఫోటోలు వైరల్ గా మారాయి.

# బిజినెస్

# లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్



గత రెండు రోజులుగా వరుస నష్టాలతో ఇన్వెస్టర్లను కలవరపెట్టిన దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం కాస్త పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుండి వచ్చిన సానుకూల సంకేతాలతో దలాల్ స్ట్రీట్ ఈరోజు ఉదయం నుంచే భారీ లాభాలతో ట్రేడ్ అవుతోంది. నేడు మార్కెట్లు ప్రారంభమయ్యే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 534 పాయింట్లు లాభపడగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 155 పాయింట్ల స్పష్టమైన లాభాల్లో నిలకడగా కొనసాగుతోంది. బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభాలను ఆర్జిస్తూ దూసుకువెళ్తున్నాయి.

**మార్కెట్లో జోష్ కు కారణాలు**

భారత్, బ్రిటన్ మధ్య చారిత్రాత్మక ఫ్రీ ట్రేడ్ ఒప్పందం అధికారికంగా అమల్లోకి రావడం మార్కెట్ వర్గాలలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. అలాగే అమెరికాలో ద్రవ్యోల్బణం త్వరలోనే తగ్గుముఖం పట్టవచ్చనే అంతర్జాతీయ నివేదికలు గ్లోబల్ మార్కెట్లతో పాటు దేశీయ ఇన్వెస్టర్లలోనూ ధీమాను పెంచాయి. ఇక మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ ఈరోజు 96.25 వద్ద ట్రేడ్ అవుతోంది. గత రెండు రోజుల నష్టాల నుంచి మార్కెట్లు కోలుకోవడంతో అటు బ్రోకరేజ్ సంస్థలు, ఇటు సామాన్య ఇన్వెస్టర్లు ఊపిరి పీల్చుకున్నారు. నేటి ముగింపు సమయానికి ఈ లాభాలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

అంతర్జాతీయ మార్కెట్లలో వస్తున్న మార్పుల నేపథ్యంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బుధవారం బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. గత కొన్ని రోజులుగా హెచ్చుతగ్గులకు లోనవుతున్న పసిడి ధరలు ఈరోజు కొద్దిపాటి లాభాలను నమోదు చేశాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.770 పెరిగి రూ.1,43,570 కి చేరింది. అదేవిధంగా, ఆభరణాల తయారీకి ఎక్కువగా ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేట్ రూ.700 వృద్ధి చెంది రూ.1,31,600 వద్ద పలుకుతోంది. బంగారంతో పోలిస్తే పారిశ్రామిక డిమాండ్ నెమ్మదించడంతో వెండి ధరలలో ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,35,000 వద్దే స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, డాలర్‌తో రూపాయి మారకం విలువ ఆధారంగానే ఈ ధరల పెరుగుదల నమోదైనట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. స్థానిక జ్యువెలరీ వ్యాపారుల సమాచారం ప్రకారం.. ధరలు సరికొత్త గరిష్ఠాల వద్ద కొనసాగుతుండటంతో వినియోగదారులు కొనుగోళ్ల విషయంలో కాస్త ఆచి తూచి అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు.

# అమల్లోకి భారత్ - యూకే ఫ్రీ ట్రేడ్ డీల్.. భారీగా తగ్గనున్న ధరలు



భారత్ - బ్రిటన్ దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేటి నుండి అధికారికంగా అమల్లోకి వచ్చింది. ఇటీవల జరిగిన జీ7 సదస్సులో భాగంగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ జరిపిన ద్వైపాక్షిక భేటీ అనంతరం ఈ ఒప్పందానికి సంబంధించిన తుది ఆమోదం లభించింది. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సరికొత్త గరిష్ఠాలకు చేరుకోవడమే కాకుండా, ఎగుమతి-దిగుమతి సుంకాలు భారీగా తగ్గనున్నాయి. అలాగే రెండు దేశాల మధ్య ట్రేడ్ వాల్యూ 2030 నాటికి 56 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచడమే ఈ ఒప్పందం మరో కీలక లక్ష్యం కూడా.

**భారతీయ ఎగుమతులపై 'జీరో డ్యూటీ'**

ఈ ఒప్పందం ప్రకారం భారతదేశం నుండి బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే 99% పైగా వస్తువులపై యూకే ప్రభుత్వం పూర్తి సుంకం రాయితీ కల్పించింది. దీనివల్ల యూకే మార్కెట్‌లో భారతీయ వస్తువుల ధరలు గణనీయంగా తగ్గి, చైనా మరియు ఇతర దేశాల ఉత్పత్తులతో పోటీ పడేలా మన ఎగుమతులు పెరగనున్నాయి. ప్రధానంగా టెక్స్‌టైల్స్ & గార్మెంట్స్ లోని భారతీయ చేనేత, వస్త్ర రంగానికి భారీ ఊతం లభిస్తుంది. తోలు వస్తువుల ఎగుమతులు పుంజుకుంటాయి. రత్నాలు, ఆభరణాల రంగానికి సరికొత్త మార్కెట్ లభిస్తుంది. పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతి సులభతరం అవుతుంది. సముద్ర ఆహార ఉత్పత్తులు, ప్యాక్డ్ ఫుడ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. సర్వీసెస్ సెక్టర్, 'సోషల్ సెక్యూరిటీ' నిబంధన

కేవలం వస్తువుల మార్పిడి మాత్రమే కాకుండా, సేవల రంగంలో ఈ ఒప్పందం భారతీయులకు పెద్ద ఊరటనిచ్చింది. ఐటీ నిపుణులు, ఇంజనీర్లు, డాక్టర్లు, ఇతర నైపుణ్యం కలిగిన ప్రొఫెషనల్స్‌కు బ్రిటన్‌లో ఉపాధి అవకాశాలు సులభతరం అవుతాయి. సోషల్ సెక్యూరిటీ అగ్రిమెంట్ ప్రకారం యూకేలో తాత్కాలిక ప్రాజెక్టుల కోసం పని చేసే భారతీయ ఉద్యోగులు 5 సంవత్సరాల వరకు డబుల్ సోషల్ సెక్యూరిటీ కంట్రిబ్యూషన్ అంటే రెండు దేశాల్లోనూ చెల్లించే సామాజిక భద్రతా పన్నులు ఇకపై చెల్లించాల్సిన అవసరం లేదు. దీనివల్ల భారతీయ కంపెనీలకు, ఉద్యోగులకు భారీగా ఖర్చు తగ్గుతుంది.

**ఏ వస్తువుల ధరలు తగ్గుతాయి?**

బ్రిటన్ నుండి భారతదేశానికి దిగుమతి అయ్యే వస్తువుల పన్నులలో మార్పులు చేయడం వల్ల భారతీయ మార్కెట్లో ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. పరిశ్రమల్లో వాడే అత్యాధునిక బ్రిటీష్ యంత్రాల, వాటి విడి భాగాల ధరలు తగ్గుతాయి.

బ్రిటన్ నుండి వచ్చే లగ్జరీ కార్లు, ఇతర వాహనాల ధరలు భారీగా తగ్గనున్నాయి. యూకేకు చెందిన బ్రాండెడ్ ఆహార పదార్థాలు, చాక్లెట్లు, పండ్ల ధరలు దిగివస్తాయి.

# రూ.6.7 లక్షల సంపద ఆవిరి



అమెరికా టెక్ దిగ్గజం ఐబీఎం స్టాక్ మార్కెట్లో ఘోర పతనాన్ని చవిచూసింది. మంగళవారం నాటి వాల్‌స్ట్రీట్ ట్రేడింగ్‌లో కంపెనీ షేరు విలువ ఒక్కరోజే 25.21% కుప్పకూలి 217.07 డాలర్లకు పడిపోయింది. దీంతో కేవలం కొన్ని గంటల్లోనే కంపెనీకి చెందిన 70 బిలియన్ డాలర్లు అంటే రూ.6.7 లక్షల కోట్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. ఐబీఎం చరిత్రలో ఇలాంటి దారుణమైన పతనం చోటుచేసుకోవడం గత 58 ఏళ్లలో ఇదే తొలిసారి.

**ఆ ఒక్కమాట.. లక్షల కోట్లు ఆవిరి**

వచ్చే వారం విడుదల కానున్న త్రైమాసిక ఫలితాల ప్రాథమిక వివరాల ప్రకారం.. కంపెనీ ఆదాయం కేవలం 1% మాత్రమే పెరిగి 17.2 బిలియన్ డాలర్లకు పరిమితం కానుంది. అలాగే, కంపెనీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారం 7% నష్టపోయింది. మార్కెట్ ఒడిదుడుకులను అంచనా వేయడంలో తాము విఫలమయ్యామని ఐబీఎం భారత సంతతి సీఈఓ అరవింద్ కృష్ణ స్వయంగా ఒప్పుకున్నారు. ప్రస్తుతం క్లయింట్ కంపెనీలన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాలు, సైబర్ సెక్యూరిటీపైనే భారీగా ఖర్చు పెడుతున్నాయని, ఫలితంగా ఐబీఎం సాంప్రదాయ ఉత్పత్తులు, సర్వర్లకు గిరాకీ ఒక్కసారిగా తగ్గిపోయిందని ఆయన వెల్లడించారు. AI తో వచ్చిన ఈ వేగవంతమైన మార్పును ముందే గ్రహించలేకపోయామని స్వయంగా సీఈఓ లేఖలో పేర్కొనడం ఇన్వెస్టర్లలో ఆందోళన పెంచి, అమ్మకాల ఒత్తిడికి దారితీసింది.



# అలాంటి వాడిని !

ఒకప్పటి టాలీవుడ్ స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. టాలీవుడ్ ఇండస్ట్రీలో ఉన్న బడా హీరోలు అందరి సరసన సినిమాలు చేసిన పూజా, ఇప్పుడు పత్తా లేకుండా పోయింది. అల్లు అర్జున్ తో అలా వైకుంఠపురంలో సినిమా చేసి బంపర్ హిట్ అందుకున్న పూజా హెగ్డే... ఆ తర్వాత గుంటూరు కారంలో అవకాశం దక్కించుకున్నారు. కానీ ఆ ప్రాజెక్టు నుంచి మధ్యలోనే ఆమెను తప్పించింది చిత్ర బృందం. ఈ తరుణంలోనే టాలీవుడ్ ఇండస్ట్రీలో ఆమెకు అవకాశాలు రావడం లేదు. కానీ తమిళ్ అటు బాలీవుడ్ ఇండస్ట్రీలో రాణించే ప్రయత్నం చేస్తున్నారు పూజా హెగ్డే. ఈ నేపథ్యంలోనే తాజాగా సల్మాన్ ఖాన్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సల్మాన్ ఖాన్ చాలా మంచివారని.. అతనికి కుట్రలు, కుతంత్రాలు తెలియవంటూ వ్యాఖ్యానించారు. కొంతమంది హీరోలు మాత్రం కుట్రలు పన్నుతుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ సల్మాన్ ఖాన్ మాత్రం రియల్ గా జెన్యూన్ పర్సన్ అంటూ ప్రశంసించారు. మైండ్ లో ఏది ఉంటే అది బయటకు చెప్తారని తెలిపారు. అలా ఉండటం చాలా కష్టమని పూజా హెగ్డే వెల్లడించారు. అటు ప్రభాస్ అంటే ఫుడ్ గుర్తుకు వస్తుందని పేర్కొన్నారు. డాన్స్ చేసేటప్పుడు మ్యూజిక్ ను ఎంజాయ్ చేయడాన్ని హృతిక్ రోషన్ నుంచి నేర్చుకున్నట్లు వివరించారు. అరబిక్ కుతు, మోనికా పాటలు తన ఫేవరెట్ డాన్స్ నెంబర్స్ అంటూ వ్యాఖ్యానించారు.

# గట్టి హెచ్చరికేనా?




బాలీవుడ్‌లో ఇప్పటివరకు ఎన్నో స్పై యాక్షన్ థ్రిల్లర్ చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. వాటిలో చాలావరకు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను కూడా అందుకున్నాయి. ముఖ్యంగా స్పై యూనివర్స్ చిత్రాల నిర్మాణంలో యష్ రాజ్ ఫిల్మ్స్ ముందంజలో ఉంది. ఈ బ్యానర్ నుంచి వచ్చిన పలు స్పై చిత్రాలు భారీ విజయాలను నమోదు చేశాయి. అయితే ఇటీవల ఈ బ్యానర్ రూపొందించిన స్పై యాక్షన్ థ్రిల్లర్‌లు ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక వరుస పరాజయాలను చవిచూస్తున్నాయి. తాజాగా ఆలియా భట్ ప్రధాన పాత్రలో యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మించిన 'ఆల్ఫా' కూడా భారీ అంచనాల మధ్య విడుదలైంది. అయితే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేక నిరాశపరిచింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించడంలో విఫలమైంది. మరోవైపు తక్కువ బడ్జెట్‌తో రూపొందిన కొన్ని చిత్రాలు బలమైన కథ, కంటెంట్‌తో మంచి విజయాలు సాధిస్తున్నాయి. దీంతో భారీ ఖర్చు కంటే ప్రేక్షకులను ఆకట్టుకునే కంటెంట్‌కే ప్రాధాన్యం ఇవ్వాలని, బాలీవుడ్ ఈ పరిణామాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# చాలా గ్యాప్ తర్వాత కన్నడలోకి..



ఒకప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో వరుస ఆఫర్ల అందుకుంటూ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది హన్సిక. ఇక కెరీర్ పీక్స్‌లో ఉన్న సమయంలో ప్రేమ వివాహం చేసుకుని సినిమాలకు దూరం కాగా.. ఇటీవల విడాకులు తీసుకుని ప్రజెంట్ తన సెకండ్ ఇన్నింగ్స్‌పై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు సినిమా ఆఫర్ల కోసం ఎదురు చూస్తూనే పలు షోలకు జడ్జీగా వ్యవహరిస్తూ సందడి చేస్తుంది. ఇదిలా ఉంటే.. తాజాగా హన్సిక సినిమాకు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఒకటి వైరల్‌గా మారింది. చాలా గ్యాప్ తర్వాత ఈ బ్యూటీ మళ్లీ శాండల్‌వుడ్‌కు తిరిగి ఎంట్రీ ఇవ్వబోతుంది. దివంగత పునీత్ రాజ్‌కుమార్ సరసన 'బిందాస్' సినిమాతో కన్నడలో అరంగేట్రం చేసిన హన్సిక.. ఆ తర్వాత మళ్లీ కన్నడలో సినిమా చేయలేదు. ఈ క్రమంలోనే ఇన్నాళ్లకు తన రెండో చిత్రాన్ని ఓకే చేసింది. 'పారడాక్స్' అనే పాన్-ఇండియా సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రంలో ఆమె ప్రధాన పాత్రలో నటించబోతుంది. సుదీర్ఘ విరామం తర్వాత కన్నడ చిత్రసీమలోకి హన్సిక తిరిగి వస్తుండగా.. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన న్యూస్ వైరల్‌గా మారింది. కెప్టెన్ కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, మరియు హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.

# మున్నాళ్ల ముచ్చటగానే



అక్కినేని అఖిల్ నటించిన 'ఏజెంట్' సినిమా భారీ డిజాస్టర్‌గా నిలవడంతో కొద్ది కాలం పాటు గ్యాప్ తీసుకున్న విషయం తెలిసిందే. దాదాపు మూడేళ్ల తర్వాత అఖఇల్ 'లెనిన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మురళి కిశోర్ అబ్బూరి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో భాగ్యశ్రీబోర్సే హీరోయిన్‌గా నటించారు. రాయలసీమ బ్యాక్‌డ్రాప్ తెరకెక్కిన ఈ చిత్రాన్ని థియేటర్స్‌లో విడుదల చేయగా.. బాక్సాఫీసు వద్ద ఘన విజయం సాధించింది. వసూళ్ల పరంగా కూడా దూసుకుపోతోంది. ఈ మూవీ రిలీజైన మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 61 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి సంచలనం సృష్టించింది. అంతేకాకుండా సామాన్య ప్రేక్షకులతో పాటు సినీ సెలబ్రిటీల నుంచి కూడా భారీగా ప్రశంసలు పొందుతూ థియేటర్లలో సునామీ సృష్టిస్తోంది. మూడేళ్ల తర్వాత తన సినిమా ఇలా గ్రాండ్ సక్సెస్ కావడంతో అఖిల్ ఎంతో సంతోషంలో మునిగితేలుతున్నారు. టాలీవుడ్‌కి చెందిన పలువురు స్టార్ హీరోలు సైతం ఆయన సినిమాపై ప్రశంసలు కురిపిస్తుండటంతో.. అందరి దృష్టి అంతా 'లెనిన్' చిత్రంపైనే పడింది. అయితే, ఒకవైపు ఇంత పెద్ద సక్సెస్ ఎంజాయ్ చేస్తుండగానే.. మరోవైపు ఈ సినిమాపై సోషల్ మీడియాలో దారుణమైన ట్రోలింగ్ మొదలైంది. 'లెనిన్' చిత్రంలోని క్లైమాక్స్ సీన్ కాపీ కొట్టారంటూ నెట్టింట పలు పోస్టులు వైరల్‌గా మారాయి. ఈ సినిమాకే అత్యంత కీలకమైన, హైలైట్‌గా నిలిచిన క్లైమాక్స్ సీన్.. 1999లో నందమూరి బాలకృష్ణ నటించిన 'కృష్ణబాబు' మూవీలోని సీన్ అంటూ నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ రెండు సీన్లకు సంబంధించిన వీడియోలను కట్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. నందమూరి బాలకృష్ణ, మీనా, రాశి ప్రధాన పాత్రల్లో నటించిన 'కృష్ణబాబు' సినిమాకు ముత్యాల సుబ్బయ్య దర్శకత్వం వహించారు. 1999లో విడుదలైన ఆ సినిమా అప్పట్లో యావరేజ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు ఆ పాత సినిమాలోని సీన్‌ను లెనిన్ దర్శకుడు మురళి కిశోర్ కాపీ కొట్టారంటూ ట్రోలర్స్ రచ్చ చేస్తున్నారు. ఒకవైపు బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురుస్తున్నప్పటికీ, ఈ కాపీ వివాదం నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. దీంతో ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు అఖిల్ సంతోషం మున్నాళ్ల ముచ్చటగానే మిగిలిందని పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

# కీలక పాత్రలో కన్నడ బ్యూటీ




సూపర్‌స్టార్ రజనీకాంత్ తన బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద రచ్చ లేపేందుకు సిద్ధమవుతున్నారు. రజనీ ప్రస్తుతం యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ అశ్వత్ మరిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ధర్మన్' షూటింగ్‌తో ఫుల్ బిజీగా ఉన్నారు. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక ఇంట్రెస్టింగ్ కాస్టింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. 'సప్త సాగరాలు దాటి' సినిమాతో సౌత్ ఇండియా వ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లోకి అడుగుపెట్టారు. 'ధర్మన్' సినిమాలో ఆమె ఒక కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. తాజాగా ఆమె ఈ సినిమా షూటింగ్‌లో కూడా జాయిన్ అయ్యారు. రజనీకాంత్ లాంటి లెజెండరీ నటుడితో స్క్రీన్ షేర్ చేసుకునే గోల్డెన్ ఛాన్స్ దక్కించుకోవడంతో రుక్మిణి ఖుషీ అవుతోంది. తన కెరీర్ లో ఈ సినిమా స్పెషల్ గా నిలుస్తుందని భావిస్తోంది రుక్మిణి. దర్శకుడు అశ్వత్ మరిముత్తు ఈ చిత్రాన్ని హై-వోల్టేజ్ ఎలిమెంట్స్‌తో కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ప్లాన్ చేశారు. రుక్మిణి వసంత్‌తో పాటు ఈ సినిమాలో సీనియర్ నటి సిమ్రాన్, టాలెంటెడ్ బ్యూటీ రాశీ ఖన్నా కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే స్టార్ కమెడియన్ యోగి బాబు తన మార్క్ కామెడీతో నవ్వించబోతున్నారు. ఇంతమంది క్రేజీ స్టార్స్ నటిస్తుండటంతో 'ధర్మన్' సినిమాపై కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ భారీ బజ్ క్రియేట్ అవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. అనిరుధ్ ఈ సినిమాకు సంగీతం అనిడిస్తుండగా కమల్ హాసన్ నిర్మిస్తున్నారు.



# తండ్రి కోసం వెనక్కి తగ్గిన కొడుకు..

సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్నలేటెస్ట్ భారీ యాక్షన్ ఎంటర్‌టైనింగ్ 'సిగ్మా'. ఈ సినిమాతో తమిళ స్టార్ హీరో, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నాడు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరణ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కంప్లీట్ అయిందని తెలుస్తుండగా.. భారీ అంచనాల మధ్య జులై 31న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు మేకర్స్ ఇప్పటికే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. అయితే.. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ వాయిదా పడినట్లు తెలుస్తుంది. జులై 24 దళపతి విజయ్ ప్రధాన పాత్రలో నటింటిన 'జననాయగన్' సినిమా రిలీజ్ ఉండటంతో.. బాక్సాఫీస్ వద్ద తండ్రితో పోటీ వద్దు అని నిర్ణయించుకున్న 'సిగ్మా' డైరెక్టర్ జాసన్ సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు టాక్. ఈ మేరకు దీనిపై త్వరలోనే అప్డేట్ వచ్చే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాల నుంచి సమాచారం.




# 'టాక్సిక్' విషయంలో అదే జరగనుందా?

ప్రస్తుతం దక్షిణ భారత సినీ పరిశ్రమలో వరుసగా భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థల్లో కెవిన్ ప్రొడక్షన్స్ ఒకటి. ఈ సంస్థ తలపతి విజయ్ హీరోగా రూపొందిన 'జన నాయగన్' చిత్రాన్ని నిర్మించింది. తొలుత ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ఈ మూవీని విడుదల చేయాలని మేకర్స్ ప్రకటించారు. అయితే చివరి నిమిషంలో సెన్సార్ ప్రక్రియలో తలెత్తిన అడ్డంకుల కారణంగా సినిమా విడుదల వాయిదా పడింది. ఇటీవలే ఈ చిత్రానికి సెన్సార్ పూర్తికాగా బోర్డు 'యూ' సర్టిఫికెట్ జారీ చేసింది. దీంతో ఈ సినిమాను జూలై 24న విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమయ్యారు. ఇక ఇదే నిర్మాణ సంస్థ కన్నడ స్టార్ హీరో యాష్ ప్రధాన పాత్రలో రూపొందించిన 'టాక్సిక్' చిత్రాన్ని కూడా నిర్మిస్తోంది. ఈ సినిమా విడుదల తేదీ ఇప్పటికే పలుమార్లు వాయిదా పడగా, తాజాగా ఆగస్టు 26న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలను బట్టి చూస్తే, ఈ మూవీలో భారీ యాక్షన్, రక్తపాతం, రొమాంటిక్ అంశాలు ఎక్కువగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఈ చిత్రానికి కూడా సెన్సార్ బోర్డు నుంచి 'యూ' సర్టిఫికెట్ వచ్చే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే చివరికి ఈ సినిమాకు ఎలాంటి సర్టిఫికెట్ లభిస్తుందో వేచి చూడాలి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**